


# విజయభాను




హైదరాబాద్, గురువారం 06-07-2017 | VIJAYABHANU DAILY HYDERABAD EDITION | సంపుటి : 36 సంచిక : 294 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## సమాఖ్య స్ఫూర్తితోనే
# మోదీ సర్కారుకు సహకారం

హైదరాబాద్ : సుదీర్ఘ పోరాటం తర్వాత రాష్ట్రంగా ఏర్ప డి, అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్న తెలంగాణను ఆశీర్వదించాలని ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్‌ను టీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కోరారు. రామ్‌నాథ్ కోవింద్ అభ్యర్థిత్వానికి తమ పార్టీ సంపూర్ణంగా మద్దతు పలుకు తున్నదని పునరుద్ఘాటించారు. కోవింద్ భారీ మెజారిటీతో గెలువడం తథ్యమని అన్నారు. రాష్ట్రపతి ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ వచ్చిన రామ్‌నాథ్ కోవింద్.. నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్‌లో టీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాష్ట్రపతి ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. తనను రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసినప్పుడు మొట్టమొదటి మద్దతు ప్రకటన చేసింది తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆరేనని గుర్తుచేశారు. నామినేషన్ సమయంలోనూ మద్దతు తెలిపేందుకు కేసీఆర్ హాజరుకావడం సం తోషం. అందరికీ నా ధన్యవాదాలు. రాష్ట్రపతి పదవిని సమర్థంగా నిర్వహిస్తా.



నా అభ్యర్థిత్వానికి మద్దతివ్వండి అని కోవింద్ కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ దేశ అత్యున్నత పదవికి రామ్‌నాథ్ కోవింద్ పేరును టీఆర్ఎస్ తరఫున సమర్థించడం గర్వంగా ఉందన్నారు. మీ అనుభవం, కార్యదీక్షతో రాష్ట్రపతి పదవికి వన్నె తెస్తారని మాకు పూర్తి విశ్వాసం ఉంది. భారత గణతంత్ర ప్రజాస్వామ్య విలువలను పెంచుతారని ఆశిస్తున్నాం.

భారత్‌ను ఆర్థికవృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రధాని మోదీ ఆచరిస్తున్న విధానాలకు.. సమాఖ్య స్ఫూర్తిని కనబరుస్తూ టీఆర్ఎస్ సహకరిస్తున్నది. రాష్ట్రపతి ఎన్నికల్లో కోవింద్ భారీ మెజారిటీతో విజయం సాధిస్తారనడంలో సందేహం లేదు. టీఆర్ఎస్ తరఫున మరోసారి మద్దతు తెలియజేస్తున్నాం. భవిష్యత్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రగతికి మీ ఆశీర్వాదం, మార్గదర్శకత్వం తరువాయి 2లో

# మోదీకి ఆత్మీయ స్వాగతం

- భారత ప్రజలకు అందుతున్న గౌరవం

- ఇండియా ఫర్ ఇజ్రాయెల్, ఇజ్రాయెల్ ఫర్ ఇండియా

ప్రధానమంత్రి నరేంద్రమోదీ

భారత పర్యటన మధురమైన జ్ఞాపకం - రూవెన్



జెరూసలెం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇజ్రాయెల్ పర్యట నలో భాగంగా బుధవారం ఆ దేశాధ్యక్షుడు రూవెన్ రవ్లిన్‌తో మోదీ సమావేశమయ్యారు. అధ్యక్ష భవనానికి చేరుకున్న మోదీని.. రూవెన్ ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని స్వాగతం పలికారు. రూవెన్ ప్రొటోకాల్‌ను పక్కనబెట్టి మరీ.. హృదయ పూర్వకంగా నన్ను స్వాగతించారు. భారత ప్రజలకు అందుతున్న గౌరవానికి ఇదే నిదర్శనం అని మోదీ ట్వీట్ చేశారు.

ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఇరు దేశాల మధ్య బంధం ఐ ఫర్ ఐ అన్నారు. అంటే.. ఇండియా ఫర్ ఇజ్రాయెల్, ఇజ్రాయెల్ ఫర్ ఇండియా అని చెప్పుకొచ్చారు. ఇజ్రాయెల్ అధ్యక్షుడిని కలవడం గొప్పగా భావిస్తున్నానని చెప్పారు. అనంతరం రూవెన్ మాట్లాడుతూ.. భారత్‌లో తన పర్యటనను ఎన్నడూ మర్చి పోలేనని, అదో మధురమైన జ్ఞాపకమని అన్నారు. అనంతరం ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు. ప్రధాని మోదీ తరువాయి 2లో

## 13 జిల్లాల ఏసీబీ అధికారులతో
# డీజీ సమావేశం

విజయవాడ: అవినీతి నిరోధక శాఖకు చెందిన 13 జిల్లాల అధికారులతో ఆశాఖ డైరెక్టర్ జనరల్(డీజీ) బుధవారం విజయవాడలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా అవినీతి అధికారుల జాబితాను ఆయన తెప్పించుకుని పరిశీలించారు.

అలాగే అవినీతి ఉద్యోగులను ఏరేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఏసీబీ గురించి ప్రజల్లో అవగాహన, ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

# ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావాలి : గవర్నర్

హైదరాబాద్: ఇఫ్లూ (ఇంగ్లిషు అండ్ ఫారిన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ)కి ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావాలని ఇఫ్లూ వీసీ ఆచార్య సురేశ్‌కుమార్‌కు గవర్నర్ నరసింహన్ సూచించారు.

గవర్నర్‌ను రాజ్‌భవన్‌లో ఇఫ్లూవీసీ కలిశారు.

ఇటీవల ఇఫ్లూ వీసీగా సురేశ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మర్యాదపూర్వకంగా గవర్నర్‌ను కలిశారు.

ఈ సందర్భంగా వీసీతో గవర్నర్ మాట్లాడుతూ విద్యాప్రమాణాలు పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.



# బోనాలకు 10 కోట్లు మంజూరు

హైదరాబాద్ : బోనాల ఉత్సవాల నిర్వహణకు సీఎం కే చంద్రశేఖర్‌రావు రూ.10 కోట్లు మంజూరు చేసినట్టు హోంమంత్రి, బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ నాయిని నర్సింహారెడ్డి తెలిపారు.



ఉత్సవ కమిటీ సభ్యులైన డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రులు పద్మారావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు దేవాదాయశాఖ కార్యదర్శి ఎన్ శివశంకర్ తదితరులు సచివాలయంలో సమా వేశమయ్యారు.

ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గత ఏడాది కన్నా ఈసా రి రెట్టింపు నిధులు విడుదల చేశారని, అదే స్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. నిధుల్లోంచి కొంత మొత్తాన్ని సాంస్కృతికశాఖకు విడుదల చేసి సాంస్కృతిక ప్రదర్శనలకు, దేవాలయాల్లో విద్యుద్దీపాల అలంకరణకు ఖర్చు చేయాలని సూచించారు.

జీహెచ్ఎంసీ పరిధిలోని 23 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దేవాలయాలకు నిధులను అందించాలని అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని దేవాలయాల కమిటీలు నిధుల కోసం సంబంధిత అధికారులకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, వాటిని పరిశీలించి నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్పొరేటర్ల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కమిటీ అభిప్రాయపడింది. ఈనెల 7న ఉదయం 11 గంటలకు జీహెచ్ఎంసీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిం చాలని నిర్ణయించారు.


ఈ సమావేశానికి కార్పొరేటర్లందరూ హాజరు కావాలని హోంమంత్రి సూచించారు.

ఈ సమీక్షలో హైదరాబాద్ జాయింట్ కలెక్టర్ ప్రశాంతి, సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

# ఉపరాష్ట్రపతి రేసులో పలువురు ప్రముఖులు...

న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పలుపేర్లు చక్కర్లు కొడుతున్నాయి. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు మాత్రమే ఓట్లు వేస్తారు కాబట్టి ఎన్డీయే అభ్యర్థే విజయం సాధిస్తారు. పోటీ ఉన్నా నామమాత్రమే. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమి ఎవరిని బరిలో దింపనుందని ఆసక్తి కలిగిస్తోంది. రాష్ట్రపతి అభ్యర్థిని ప్రకటించే విషయంలో ఎన్డీయే చివరి వరకూ గుట్టు పాటించి అనూహ్యంగా బీహార్ గవర్నర్ రామ్‌నాథ్ కోవింద్‌ను బరిలోకి దింపింది. ఇదే తరహాలో ఉప రాష్ట్రపతి అభ్యర్థిని కూడా సొంత పార్టీ నుంచి ఎంపిక చేయాలని బీజేపీ యోచిస్తున్నట్లు సమాచారం. ఆగస్టు 5న ఉప రాష్ట్రపతి ఎన్నికలు జరగనున్నాయి. ఈనెల 18 నామినేషన్ దాఖలుకు చివరి తేదీ. ఒడిశా గవర్నర్ ఎస్‌సీ జమీర్ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఈయనను ఉపరాష్ట్రపతిని చేస్తే ఈశాన్య రాష్ట్రాల్లో పట్టు మరింత పెరుగుతుంది. కేంద్రమంత్రి, బీజేపీ సీనియర్ నేత అహ్లూవాలియా కూడా రేసులో ఉన్నారు. జార్ఖండ్ గవర్నర్ ద్రౌపతి ముర్మూ పేరును కూడా బీజేపీ అధిష్టానం పరిశీలిస్తోంది.

## జీఎస్‌టీపై సూపర్‌స్టార్
# రజనీకాంత్ స్పందన



చెన్నై : వస్తు, సేవల పన్ను(జీఎస్టీ)పై ఎట్టకేలకు సూపర్‌స్టార్ రజనీకాంత్ స్పందించారు. ఇప్పటికే జీఎస్‌టీ ప్రభావంతో తమిళనాడులో 1,100 థియేటర్లు మూతపడ్డాయి. తమిళ సినీ పరిశ్రమ ఏకమై ఆందోళన చేపడుతోంది. దీనిపై ఇప్పటికే తరువాయి 2లో






## టేకిట్ ఈజీ



అభ్యర్థుల అభివృద్ధి పనులేనా... ఎన్నికలకు ఖర్చు పెట్టే స్థోమత కూడా లెక్కేస్తారా సార్ !!

# పళనిస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురు!

చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామికి సుప్రీం కోర్టులో చుక్కెదురు అయింది. విశ్వాస పరీక్షలో గట్టెక్కేం దుకు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసినట్లు పళనిస్వా మిపై ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే.

ఈ వ్యవహారం కాస్త ఇప్పుడు ఉన్నత న్యాయస్థానం చెంతకు చేరింది. అసెంబ్లీలో విశ్వాస పరీక్ష జరిగిన తీరును పరిశీలించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జయలలిత మరణా నంతరం తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటు కోసం విశ్వాస పరీక్ష సమయంలో పన్నీర్‌సెల్వం, శశికళ,పళనిస్వామి వర్గాలు నడిపిన బేరసారాలు ఆలస్యంగా బయటపడ్డాయి.

ఒకానొద దశలో ఒక్కో ఎమ్మెల్యేకు నాలుగు కోట్లు ఇచ్చేందుకు కూడా శశికళ సిద్ధపడ్డట్లుగా తెలుస్తోంది.

ఓ జాతీయ ఛానల్ చేసిన స్టింగ్ ఆపరేషన్‌లో ఈ వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. కాగా పళనిస్వామి బల



పరీక్ష సందర్భంగా ఎమ్మెల్యేలకు భారీ ఎత్తున డబ్బు, బంగారం ఇచ్చినట్లు స్టింగ్ ఆపరేషన్‌లో బట్టబయలైన నేప థ్యంలో ప్రభుత్వాన్ని రద్దు చేయాల ప్రతిపక్ష డీఎంకే డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

# దసరాకు సందడి చేద్దాం!



మైసూరు : దసరా ఉత్సవాలకు అధిక నిధుల్ని వ్యయం చేయనున్నట్లు జిల్లా బాధ్య మంత్రి హెచ్.సి.మహదేవప్ప వెల్లడించారు. జిల్లా అధికారి కార్యాలయంలో మఆయన ఉన్నత స్థాయి అధికారుల సమావేశంలో పాల్గొన్నారు. ఆగస్టు పదిలోగా దసరా ఏనుగులు నగరానికి వచ్చేలా చూడాలని సూచించారు. ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.16 కోట్ల మేర వ్యయం చేయనుంది. ఇప్పటి వరకు ఇది రూ.10 కోట్లకే పరిమితంగా ఉండేది. ఏనుగులకు ప్యాలెస్ ప్రాంగణంలోకి ఘనంగా స్వాగతించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తారు.

'రాష్ట్ర ప్రభుత్వ పాలన నాలుగేళ్లు పూర్తి చేసుకుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 90 శాతం పూర్తిచేశాం. మిగిలిన పదిశాతం హామీల్ని ఏడాదిలోగా పూర్తి చేస్తాం' అని తెలిపారు. సమావేశంలో జిల్లా అధికారి రందీప్ తదితరులు పాల్గొన్నారు.

### కేన్సర్ రోగుల సేవకు భిన్నమైన శైలిలో

# విరాళాల సేకరణ

కటక్ : కటక్ పెద్దాసుపత్రిలో ఉన్న ఆచార్య హరిహర కేన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేద రోగులకు సేవలందించేందుకు స్మైల్ అనే స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది. రోగులకు సేవలందించేందుకు అయ్యే ఖర్చుల కోసం ఈ సంస్థ ప్రతినిధులు భిన్నమైన శైలిని అనుసరిస్తున్నారు. సంస్థ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి పాత వార్తాపత్రికలు సేకరించి, విక్రయించగా వచ్చిన నగదును రోగుల సేవలకు వినియోగిస్తున్నారు. మంగళవారం కార్యకర్తలు సినీనటుడు, ఎమ్పీ అనుభవ్ మహంతి నివాసానికి వెళ్లి పాత పేపర్లు సేకరించారు. ఈ సందర్భంగా స్మైల్ ప్రతినిధి సూరజ్ దాస్ మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి చికిత్సకు ఎక్కువగా ఖర్చవుతుందన్నారు. పేద రోగులకు అండగా నిలిచేందుకు తమ సంస్థ ప్రయత్నం చేస్తుందని, సేవలకు డబ్బు రూపంలో విరాళాలు సేకరించడం కష్టమని, ప్రతీ ఇంట్లో పాత పేపర్లు ఉంటాయని, అందువల్ల వీటినే విరాళంగా సేకరిస్తున్నామని వివరించారు. వీటిని విక్రయించగా వచ్చిన నగదు పేద రోగులకు అందిస్తున్నామన్నారు. నెల మొత్తం పేపర్లు సేకరిస్తే రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు లభిస్తుందని చెప్పారు.

### ప్రయోగాలపై దృష్టిపెట్టండి

బళ్లారి : మేడం క్యూరి విద్యార్థి లోకానికి ఆదర్శం. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రయోగాలపై దృష్టిపెట్టాలని ఎ.ఐ.ఎం.ఎస్.ఎస్. జిల్లా అధ్యక్షురాలు శాంత సూచించారు. మేడం క్యూరి విద్యార్థి దశ నుంచే ప్రయోగాలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. భౌతిక, రసాయన శాస్త్రాలో రెండు నోబెల్ బహుమతులు అందుకున్న మొదట మహిళ కావడం మనందరికీ గర్వకారణమన్నారు.

## మొదటి పేజీ తరువాయి

### మోదీకి ఆత్మీయ స్వాగతం

మూడు రోజుల పాటు ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా ముంబయి పేలుళ్ల నుంచి ప్రాణాలతో బయటపడ్డ చిన్నారి మోషేను మోదీ కలవనున్నారు. ఆ తర్వాత భారత కమ్యూనిటీ సమావేశంలో ప్రసంగిస్తారు. ఇజ్రాయెల్ నుంచి మోదీ జర్మనీ వెళ్లనున్నారు. అక్కడ జులై 7, 8 తేదీల్లో జరిగే జీ 20 సదస్సులో పాల్గొంటారు.

ఈ సందర్భంగా 3 రోజుల పాటు పర్యటించనున్న మోదీ భద్రతకు ఇజ్రాయెల్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఇందు కోసం సుశిక్షితులైన కమెండోలతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. భారత ప్రధాని ప్రస్తుతం ఇజ్రాయెల్‌లో కింగ్ డేవిడ్ హోటల్‌లో బస చేస్తున్నారు. మోదీ ఇప్పుడు ఈ విశ్వంలోనే అత్యంత సురక్షితమైన భవన సముదాయంలో ఉన్నారు. ఆయన ఇక్కడ నిశ్చితంగా ఉంటారు. బాంబు దాడులు, రసాయన దాడులు తదితర అన్ని రకాల దాడుల నుంచి ఇది అత్యంత సురక్షితం అని భారత ప్రధాని భద్రతను పర్యవేక్షిస్తు షెల్డన్ రిట్జ్ పేర్కొన్నారు. మోదీ బృందం కోసం కింగ్ డేవిడ్ హోటల్‌లో 110 గదులను కేటాయించారు. మోదీ పర్యటన నేపథ్యంలో హోటల్ పరిసరాలన్నీ భారతీయతను సంతరించుకున్నాయి. మన సంప్రదాయాలకు అద్దం పట్టేలా.. భారత్‌లో ఎక్కువగా ప్రాచుర్యంలో ఉన్న పుష్పాలతో హోటల్ రూమ్‌లను అలంకరించారు. ప్రధాని కోసం భారతీయ వంటకాలను సిద్ధం చేయిస్తున్నారు. ప్రత్యేకంగా కొన్ని గుజరాతీ వంటకాలను రూపొందిస్తున్నారు. పూర్తి శాకాహారి అయిన మోదీ కోసం.. ఈ 3 రోజుల పాటు హోటల్ పరిసరాల్లో కోడిగుడ్ల వాసన కూడా రాకుండా జాగ్రత్త తీసుకుంటున్నట్లు రిట్జ్ తెలిపారు.

### జీఎస్‌టీపై సూపర్‌స్టార్ రజనీకాంత్ స్పందన

కమల్‌హాసన్ స్పందిస్తూ అమల్లోకి వచ్చిన జీఎస్టీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా తలైవా ట్విటర్ ద్వారా ఆయన అభిప్రాయాన్ని వెల్లడించారు. తమిళ చిత్ర పరిశ్రమలో లక్షలాది మంది ప్రజల గురించి ఆలోచించి మా విన్నపాన్ని పరిగణించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాను అని ట్వీట్ చేశారు.

ఇటీవల దర్శకుడు, ఎల్ఎండీకే అధ్యక్షుడు టి.రాజేందర్ మాట్లాడుతూ.. జీఎస్‌టీపై రజనీకాంత్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. జీఎస్టీ విషయంలో కేంద్ర ప్రభుత్వం కేవలం ఉత్తరాదిపైనే దృష్టిసారిస్తోందని దక్షిణాది గురించి పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

### సమాఖ్య స్ఫూర్తితోనే మోదీ సర్కారుకు సహకారం

కోరుకుంటున్నాం. రాష్ట్రపతిగా మీకు విజయం కలుగాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను అని కేసీఆర్ చెప్పారు. సుదీర్ఘ పోరాటం తరువాత ప్రజాస్వామ్యయుతంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. జూన్ 2, 2014 నాడు తెలంగాణ ఏర్పడ్డప్పుడు మా ముందు ఎన్నో సమస్యలున్నాయి. విద్యుత్ కొరత పెద్ద సమస్యగా ఉండేది. ప్రతి రోజూ విద్యుత్ కోతలుండేవి. కానీ ఈ సమస్యను పరిష్కరించుకున్నాం. అంతేకాదు తెలంగాణ ఇప్పుడు మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఉందని చెప్పడానికి చాలా సంతోషంగా ఉంది అని కేసీఆర్ అన్నారు. చాలా తక్కువ సమయంలోనే భారత్‌లోని అగ్రశ్రేణి రాష్ట్రాల్లో ఒకటిగా తెలంగాణను నిలిపామని తెలిపారు. 17.8% వార్షిక ఆదాయం వృద్ధి రేటుతో భారత్‌లో అత్యంత వేగంగా వృద్ధిచెందుతున్న రాష్ట్రంగా తెలంగాణ కొనసాగుతున్నది.

సంక్షేమంలోనూ భారత్‌లోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. తెలంగాణ ప్రభుత్వం 38లక్షల మందికి నెలనెలా రూ.1000 చొప్పున పింఛను ఇస్తున్నది. ఇతర పథకాలద్వారా పేద ప్రజల సంక్షేమంకోసం కృషిచేస్తున్నాం. ఎస్టీ, ఎస్సీల అభివృద్ధికి ఈ ఏడాది రూ.22,400 కోట్లతో ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ రూపొందించి, దాని అమలుకు కొత్త చట్టం తెచ్చాం. పేదలకు నివాసం కోసం ఉచితంగా డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టిస్తున్నాం. దీనిద్వారా సమాజంలో పేదల గౌరవం, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది అని కేసీఆర్ చెప్పారు. తెలంగాణ పారిశ్రామికవృద్ధి కోసం.. పదిహేను రోజుల్లోనే పరిశ్రమలకు అనుమతులు ఇచ్చేలా నూతన పారిశ్రామిక విధానం టీఎస్ఐపాస్ తీసుకువచ్చామని చెప్పారు. దీనిద్వారా ఇప్పటికే 4026 దరఖాస్తులను పరిశీలించి అనుమతులు ఇచ్చామన్నారు. ఈ విధానాన్ని ప్రపంచంలోని పలు దేశాలు కీర్తించాయన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో గత రెండేండ్లుగా తెలంగాణ రాష్ట్రం భారత ప్రభుత్వం నుంచి మొదటి ర్యాంకు అందుకున్నదని గుర్తుచేశారు.

రాజకీయాలకు అతీతంగా పనిచేస్తా: కోవింద్

రాష్ట్రపతి పదవికున్న గౌరవాన్ని, ఔన్నత్యాన్ని కాపాడుతానని ఎన్డీయే అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్ చెప్పారు. రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వర్తిస్తానని స్పష్టంచేశారు. బీజేపీతో తనకున్న రాజకీయ అనుబంధం గతమని, ఇప్పుడు తాను ఏ పార్టీకీ చెందిన వ్యక్తిని కాదని తెలిపారు. బీహార్‌కు గవర్నర్ కాకముందే బీజేపీ సభ్యత్వాన్ని వదులుకున్నానని వెల్లడించారు. బీహార్ గవర్నర్‌గా రాజకీయాలకతీతంగా రాజ్యాంగపర విధులు నిర్వర్తించానని, రాష్ట్రపతి బాధ్యతలు కూడా అదే రీతిలో నిర్వహిస్తానని ప్రకటించారు. తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన టీఆర్ఎస్‌కు, పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు కోవింద్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. నేను రెండు విషయాల్లో టీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌కు అభినందనలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ఒకటి నా గౌరవార్థం హైదరాబాద్ నగరంలో స్వాగత హోర్డింగులు ఏర్పాటుచేశారు. నాకు మరో గౌరవం ఇచ్చారు. హిందీ రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చానని కేసీఆర్‌కు తెలుసు కాబట్టి.. ఆయన నా కోసం హిందీలో ప్రసంగించారు అని చెప్తూ సంతోషం వ్యక్తంచేశారు. మనది ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. రాష్ట్రపతి పదవి ఈ ప్రజాస్వామ్యంలో చాలా ముఖ్యమైనది.

డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, ఆర్ వెంకట్రామన్, ఏపీజే అబ్దుల్ కలాం, హైదరాబాద్‌కు చెందిన జాకీర్ హుస్సేన్, ఉమ్మడి ఏపీకి చెందిన నీలం సంజీవరెడ్డి.. వీళ్లంతా రాష్ట్రపతి పదవికి వన్నెతెచ్చారు అని కోవింద్ పేర్కొన్నారు. రాష్ట్రపతి పదవి రాజకీయాలకు అతీతంగా ఉండాలని చెప్పారు. కులం, భాష, ప్రాంతీయ, భౌగోళిక పరిస్థితులకు అతీతంగా.. అన్ని రంగాల్లోనూ దేశ సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తానని స్పష్టంచేశారు. సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కే కేశవరావు స్వాగతం పలుకగా, టీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి వందన సమర్పణ చేశారు. కోవింద్‌ను కేంద్ర మంత్రి ఎం వెంకయ్యనాయుడు సభకు పరిచయంచేశారు. కోవింద్‌కు కేసీఆర్ శాలువ కప్పి, మెమొంటో ఇచ్చి ఘనంగా సన్మానించారు. కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీఎం రాజకీయ కార్యదర్శి శేరి సుభాష్‌రెడ్డి, ఇతర అతిథులు వేదికపై ఆసీనులయ్యారు. రాష్ట్ర మంత్రులు, టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, మేయర్లు హాజరయ్యారు.

### రథాలపై ముగ్గురు మూర్తుల దర్శనాలు

గోపాలపూర్ : హరిశయన ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పూరీ శ్రీక్షేత్రం భక్తులతో కళకళలాడింది. రథాలపై ఉన్న జగన్నాథ, బలభద్ర, సుభద్రల దర్శనం చేసుకున్న వారంతా పూజలు చేశారు. మహిళలు ఉపవాసంతో జగన్నాథ, మహాలక్ష్మిలను ఆరాధించారు. తల్లికి పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి సుమంగళి నోములు నోచుకున్నారు. రోజంతా సందర్శకులతో శ్రీక్షేత్ర ఆవరణ కళకళలాడింది.

# రెడ్‌హిల్స్‌లో మొక్కల పెంపకం

### 2 వేల మొక్కల నాటిన గ్రేటర్ చెన్నై పోలీసులు

చెన్నై : పర్యావరణ పరిరక్షణలో కోసం చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా నగర శివారులోని రెడ్‌హిల్స్‌లో 2 వేల మొక్కలను గ్రేటర్ చెన్నై పోలీసులు నాటారు. ఎక్స్‌నోరా సంస్థ నిర్వాహకులు, విద్యార్థుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో చేపట్టారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చెన్నై వేప్పేరిలోని గేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జూన్ 5న మొక్కలు నాటే కార్యక్రమాన్ని కమిషనరు ఎ.కె.విశ్వనాథన్ ప్రారంభించారు. ఇందులో పోలీస్ డిప్యూటీ కమిషనర్లు, సహాయ కమిషనర్లు పలువురు పాల్గొని మొక్కలు నాటారు. గ్రేటర్ చెన్నైలోని అన్ని పోలీసు స్టేషన్లు, పోలీసుల నివాస సముదాయాలు, కార్యాలయాలు, వాటి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటాలని ఈ ఈ సందర్భంగా సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. దీంతో ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్య క్రమాలను పోలీసులు చేపట్టారు. విద్యార్థులతో కలిసి ఈ కార్య క్రమాలు నిర్వహించడంతో పాటు నాటిన మొక్కలను పర్యవేక్షి స్తున్నారు. ఈ నేపథ్యంలో నగర శివారులోని రెడ్‌హిల్స్‌లో 2 వేల మొక్కలు నాటే భారీ కార్యక్రమం జరిగింది. పాయ సంపాక్కంలో గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనరు ఎ.కె.విశ్వనాథన్ పాల్గొని మొక్క నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మాధవరం డిప్యూటీ కమిషనరు, సహాయ కమి షనర్లు, పోలీసులు, ఎక్స్‌నోరా సంస్థ నిర్వాహకులు, పాఠశాల విద్యా ర్థులు పాల్గొని 2 వేల మొక్కలు నాటారు. నెల రోజుల్లో గ్రేటర్ చెన్నై పోలీసు విభాగం ఆధ్వర్యంలో అంబత్తూరు పోలీస్ జిల్లాలో 13,222 మొక్కలు సహా గ్రేటర్ చెన్నైలో 28,004 మొక్కలు నాటడం గమనార్హం.

### జేడీఎస్‌ను అధికారంలోకి తేవడమే లక్ష్యం

హెచ్.విశ్వనాథ్



బెంగళూరు : రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి జేడీఎస్‌ను బలోపేతం చేసి, అధికారంలోకి తేవడమే తన లక్ష్యమని మాజీ మంత్రి హెచ్.విశ్వనాథ్ వెల్లడించారు. ఇక్కడ ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేసి మాజీ ప్రధాని దేవేగౌడ, మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామిల సమక్షంలో జేడీఎస్‌లో చేరారు. అనంతరం ఆయన కార్యకర్తల్ని ఉద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీలో చేసినట్లే జేడీఎస్ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తానన్నారు.

కార్యకర్తలను చైతన్యవంతుల్ని చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ నేతలతో కలిసి పర్యటిస్తానని తెలిపారు. రాజకీయాలనేవి నిలబడే నీరు కాదు. జేడీఎస్‌లో చేరికకు అనేక కారణాలు ఉన్నట్లు చెప్పారు. గతాన్ని చర్చించబోనని, కొత్త ఇంటికి వచ్చానని, మంచి చేయాలనే ఉద్దేశం ఉన్నట్లు విశ్వనాథ్ తెలిపారు. కుమారస్వామి ముఖ్యమంత్రి అయినప్పుడు తాను విధానసభ ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చుని తిలకించి యువకుడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారని, అంతా మంచి జరుగుతుందని వూహించినట్లు తెలిపారు. ఇప్పుడు ఆయనతో కలిసి పని చేస్తానన్నారు. మూడునెలల కిందట జేడీఎస్ నేతలు తనను కలిసి పార్టీలోకి ఆహ్వానించారని విశ్వనాథ్ తెలిపారు. మాజీ ప్రధాని దేవేగౌడ అనేక రంగాల్లో అభివృద్ధికి బీజాలు వేశారని, ఆయన మార్గంలో ప్రయాణిస్తామన్నారు. విశ్వనాథ్ రానున్న విధానసభ ఎన్నికల్లో మైసూరు స్థానం నుంచి పోటీ చేస్తారని జేడీఎస్ అధ్యక్షుడు కుమారస్వామి వెల్లడించారు.

### పోటీ రసవత్తరంగా ఉంటుంది: పిటి.ఉష

భువనేశ్వర్ : ఆసియన్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించేందుకు క్రీడాకారులు హోరాహోరిగా తలపడతారని, పోటీ రసవత్తరంగా ఉంటుందని పరుగుల రాణి పి.టి.ఉష అన్నారు. భువనేశ్వర్ చేరిన ఆమె విలేఖరులతో మాట్లాడుతూ పోటీలో చైనా, జపాన్, కతార్ క్రీడాకారులతో భారత్ క్రీడా కారులు హోరాహోరిగా తలపడే అవకాశం ఉందన్నారు. భారత్ జట్టులో ఎం.పువామ, నయన జెంబ్, ద్యుతి చంద్, శ్రావణి నందా, మన్‌ప్రీత్ కౌర్, సరితా సింగ్, అనురాణి, నీరజ్ చోప్రా, వికాస్ గౌడ్, సిద్ధార్థ్ తింగలియా, కృపాల్‌సింగ్, అంకిత్‌శర్మ, అర్విందర్ సింఢ్, అమియో మల్లిక్ వంటి ప్రపంచస్థాయి క్రీడాకారులు, క్రీడాకారిణులు ఉన్నారన్నారు.

ఒడిశాలో జరిగే పోటీలో 30కిపైగా పతకాలు భారత్ కైవసం చేసుకునే అవకాశం ఉందని వివరించారు.

# 'అంకుర' ఆకృతి

బెంగళూరు : దేశ్‌పాండే ఫౌండేషన్ సాయంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఎలివేట్-100 పథకం కింద నూరు అంకుర పరిశ్రమల స్థాపకులకు ఆర్థిక సాయాన్ని అందించే మార్గం సుగుమమైంది. సంబంధిత అంతర్జాల వేదిక, లాంఛనాల్ని సమాచార, జీవ సాంకేతిక మంత్రి ప్రియాంక్ ఖర్గే బెంగళూరులో ప్రారంభించారు. ప్రభుత్వ ఆర్థిక సాయంతో సంస్థను ఉన్నతీకరిందలచిన వారు ఈ నెల నాలుగు నుంచి 18వ తేదీ వరకూ అంతర్జాల వేదిక ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలి. కర్ణాటకను ప్రపంచ అంకుర పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయటమే లక్ష్యంగా కార్య క్రమాల్ని అమలు చేస్తున్నట్లు ఖర్గే ఈ సందర్భంగా వెల్లడించారు. ఇప్పటి వరకూ 46 అంకుర పరిశ్రమలకు రూ.15.68 కోట్లు వితరణ చేశామన్నారు.

వీటిలో 26 జీవ సాంకేతిక, ఎనిమిది పర్యాటక, 12 సమాచార సాంకేతిక పరిశ్రమలని వివరించారు. కేవలం ఆర్థిక సాయాన్నే కాకుండా సాంకేతిక, వ్యాపార సహాయాన్ని కూడా అందిస్తామని చెప్పారు. వచ్చే నెల 29, 30లలో సాయానికి ఎంపికైన సంస్థల పేర్లు ప్రకటిస్తామన్నారు.


### విద్యుత్తు కోతకు నిరసనగా ధర్నా


పెరియపాళ్యం: విద్యుత్తు కోతకు నిరసనగా ఆరణివాసులు ధర్నా నిర్వహించారు. పెరియపాళ్యం సమీపంలోని ఆరణి పట్టణ పంచాయతీలో సుమారు 30 వేల మంది నివసిస్తున్నారు. పట్టణానికి సుమారు పది కిలోమీటర్ల దూరంలోని దురైనెల్లూను లోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. ప్రతిరోజు అప్రకటిత విద్యుత్తు కోత కారణంగా అవస్థలు పడుతున్నట్లు పట్టణ వాసులు వాపోతున్నారు. విద్యుత్తు కోతకు నిరసనగా పెద్ద సంఖ్యలో పట్టణవాసులు ఆరణిలోని టీఎన్ఈబీ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని కొన్ని లోపాలను సరిచేశామని, ఇకపై విద్యుత్తు కోత సమస్య ఏర్పడందని అధికారులు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

### రూ.10 కోట్లిచ్చినా 'బిగ్‌బాస్'లో పాల్గొనను: లక్ష్మీ రామకృష్ణన్

చెన్నై : విశ్వనటుడు కమల్‌హాసన్ యాంకర్‌గా వ్యవహరిస్తున్న బుల్లితెర కార్యక్రమం 'బిగ్‌బాస్'. ప్రస్తుతం తమిళ ప్రజల అందరి దృష్టిని ఆకర్షించిన ఈ కార్యక్రమం భిన్నమైన ఫలితాలను సొంతం చేసుకుంటోంది. ఒక ఇంట్లో వంద రోజుల పాటు ఉండాలన్నదే దీని ప్రధాన ఉద్దేశం. నటుడు శక్తి, శ్రీ, హాస్యనటుడు వయ్యాపురి, గంజాకరుప్పు, నటి నమిత, అనూయ, ఓవియాలతో పాటు మొత్తం 15 మంది ఇందులో పాల్గొన్నారు.


# పురాతన బావుల పునరుద్ధరణ





గంగావతి : పూర్వం ప్రధాన జలవనరులు బావులే. నేడు వాటిని ఎవరూ ఉపయోగించకపోవడంతో వాటిలో అత్యధికం నిరుపయోగంగా మారాయి. చెత్త, పూడికతో నిండి అసహ్యకరంగా కనిపిస్తున్నాయి. వర్షాభావం కారణంగా ఈ ఏడాది గంగావతి తాలూకాలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి తలెత్తింది. భూగలో జలవనరులు అడుగంటి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాల్సి వచ్చింది. ఈ పరిణామం కొందరు యువకులను కదిలించింది. జల సంరక్షణకు తమవంతు కృషి చేయాలని సంకల్పించారు. తుంగభద్ర జల సంరక్షణ సమితిగా ఏర్పడి తాలూకాలోని పురాతన బావుల్లో జలకళ పునరుద్ధరణకు నడుంబిగించారు. ప్రతి గ్రామం వెళ్లి స్థానికుల సహకారంతో బావులను శుభ్రం చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో నాగేనహళ్లిలో చెత్త, పూడికతో నిండిన బావిని శుభ్రం చేయడంతో దాంట్లో నీరు వూరడం మొదలైంది. ఈ సందర్భంగా సమితి గౌరవాధ్యక్షుడు శ్రవణకుమార్ రాయ్కర్ మాట్లాడుతూ 'పురాతన బావులను పునరుద్ధరిస్తే గ్రామీణ ప్రాంతాల్లో కొంతవరకు నీటి సమస్యను నివారించవచ్చు. పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో 1,876 పురాతన బావులను గుర్తించాం. అవన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. వాటి పునరుద్ధరణ కోసం తుంగభద్ర జలసంరక్షణ సమితిని ఏర్పాటు చేశాం. బావులు ఉన్న ప్రతి గ్రామం వెళ్లి స్థానికుల సహకారంతో వాటిని శుభ్రం చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కోసం ఆర్.ఒ. కేంద్రాలు ఉన్నాయి. శుభ్రం చేసిన బావుల్లో నీరు గ్రామస్థుల ఇతర అవసరాలకు ఉపయోగపడుతున్నాయి' అని చెప్పారు.

### ప్రతిభావంతులకు ఉచిత వైద్య శిబిరం



షోలింగర్ : పట్టణంలోని ప్రత్యేక ప్రతిభావంతులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్వశిక్ష అభియాన్ సంస్థ తరపున స్థానిక ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాలలో 18 సంవత్సరాల లోపున్న ప్రత్యేక ప్రతిభావంతుల కోసం ఈ శిబిరం ఏర్పాటు చేశారు. సర్వశిక్ష అభియాన్ కేంద్రం సూపర్ వైజర్ జయకుమార్ అధ్యక్షత వహించి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ప్రత్యేక ప్రతిభావంతులకు వైద్య పరీక్షలు నిర్వహించి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్య క్రమంలో యూనియన్ ప్రాథమిక విద్య సహాయ అధికారి మురుగన్, పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఈశ్వర పాండి, అదనపు సహాయ విద్యా ధికారి మురుగన్ తదితరులు పాల్గొన్నారు. మొత్తం 185 ప్రత్యేక ప్రతిభా వంతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

# తెరాస పూర్తిగా దుష్ప్రచారం చేస్తోంది



ఆదిలాబాద్ : కాంగ్రెస్ పదేళ్లకాలంలో చేయలేని పనిని.. తెరాస మూడేళ్ల పాలనలోనే ఆదిలాబాద్ జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తున్నామని మంత్రి హరీశ్‌రావు చెప్పిన మాటలు పూర్తిగా అబద్ధాలని కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి భార్గవ్ దేశ్‌పాండే అన్నారు. మంత్రి బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని.. తెరాస పూర్తిగా దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో లోయర్‌పెన్‌గంగా ప్రాజెక్టు నిర్మిస్తున్నామని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని వివరించారు. చనక-కోర్టా బ్యారేజీ పనులు 2018 జనవరి కల్లా పూర్తిచేస్తామని చెబుతున్నారని.. ఇప్పటికి కనీసం 25 శాతం పనులు కూడా పూర్తికాలేదని తెలిపారు. ఈ పనులు పూర్తిగా నాసిరకంగా జరుగుతున్నాయని ఇది నిరూపించేందుకు బహిరంగ చర్చకు సిద్ధమని సవాలు విసిరారు. నిరూపించకపోతే ముక్కు నేలకు రాస్తానని స్పష్టంచేశారు. పంప్‌హౌస్ పనుల కోసం రూ.73 కోట్లు మంజూరుచేశారని.. ఈ పనులకు టెండర్లు పిలవకుండా పీజీఆర్ ఇన్‌ఫ్రాకు అప్పగించారని, ఇందులో హరీశ్‌రావు బంధువుల హస్తం ఉందని ఆరోపించారు. సాత్నాల ప్రాజెక్టు కెనాల్ కోసం రూ.28 కోట్లు కేటాయిస్తే విజయవాడకు చెందిన ఓ సంస్థకు 3 శాతం కమిషన్‌పై పనులు అప్పగించారని, ఇందులో మంత్రి రామన్న కుటుంబసభ్యుల హస్తం ఉందని పేర్కొన్నారు. ఇటీవల జిల్లాకు వచ్చిన మంత్రి కేటీఆర్ జోగురామన్న బాగా అభివృద్ధి చేస్తున్నారని పొగిడారని ఆయన ఇక్కడ చేసిందేమిటో ప్రజలను అడిగితే చెబుతారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పథకాల్లో పూర్తిగా అవినీతి చోటుచేసుకుంటోందని విమర్శించారు. రాబోవు రోజుల్లో తెరాస దిక్కులేకుండాపోతుందని చెప్పారు. బోథ్ నియోజకవర్గ బాధ్యుడు అనిల్‌జాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులకు రంగులు వేసి తెరాస ప్రభుత్వం నిర్మించిందని చెబుతున్నారని విమర్శించారు. ప్రాజెక్టుల వల్ల ముంపునకు గురైన వారికి ఇప్పటికీ పరిహారం రాలేదని తెలిపారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నేతలు భూతం ఆశారెడ్డి, సంజయ్, మంగేష్ దేవతడే, దినేష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, బండి నర్సింహచారి, మాదవ్, రాజుయాదవ్, శ్రీనివాస్, శ్రీధర్, ఆత్రం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



మెదక్ : మెదక్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-19 బ్యాడ్మింటన్ పోటీల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల క్రీడాకారులు సత్తాచాటారు. పట్టణంలోని పీఎన్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో బాల, బాలికల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 200 మంది వరకు క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. ఆయా విభాగాల్లో తుదిపోటీలు జరిగాయి. బాలుర సింగిల్స్‌లో సాయంబోత్ర (హైదరాబాద్) విజేతగా నిలవగా, లోహిత్(రంగారెడ్డి) రన్నర్‌గా నిలిచారు. బాలికల సింగిల్స్‌లో విజేతగా మేఘనారెడ్డి(హైదరాబాద్), రన్నర్‌గా శ్రీవిద్య(మెదక్), బాలుర డబుల్స్‌లో అకాశ్‌చంద్రన్, సాయిరోహిత్(హైదరాబాద్) విజేతలుగా, నవనీత్, సిద్దార్థ్ ఎలంగో(మెదక్) రన్నర్‌గా, బాలికల డబుల్స్‌లో సుప్రియ, వన్షిక (హైదరాబాద్), భార్గవి, పూర్విసింగ్(రంగారెడ్డి) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రశాంత్(ఖమ్మం), సుప్రియ(రంగారెడ్డి), దానిక్, భార్గవిలపై గెలుపొందారు. పాలనాధికారి భారతి శికెరి, మెదక్ పురపాలిక అధ్యక్షులు మల్లికార్జున్‌గౌడ్ విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపికలను అందజేశారు.

## జీఎస్టీకి వ్యాపారులందరూ సిద్ధం కావాలి

వీరన్నపేట : కేంద్రం వస్తు సేవల పన్ను తీసుకువచ్చిన నేపథ్యంలో జిల్లాలోని ఔషధ దుకాణాల యజమానులు అందరూ దానిని అమలు చేసేందుకు సిద్ధం కావాలని కెమిస్టు అండ్ డ్రగ్గిస్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటపతి కోరారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన కెమిస్టు అండ్ డ్రగ్గిస్ట్ సంఘం జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చాలా మంది వ్యాపారులకు ముందు నుంచి దుకాణాల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించామని, కాని నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఇకనైనా వాటిని ఏర్పాటు చేసుకొని అమ్మకలను ఆన్‌లైన్ చేసుకోవాలని కోరారు. దీంతోపాటు ఔషధాలు విక్రయించే సమయంలో కచ్చితంగా బిల్లు ఇవ్వాలని అన్నారు. బిల్లు ఇస్తే ధర తగ్గించాలని వినియోగదారుడు సైతం అడిగే అవకాశం ఉండదన్నారు. ఔషధ నియంత్రణ అధికారి దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఔషధ దుకాణాల యజమానులు చట్టానికి లోబడి విక్రయించాలని కోరారు. కెమిస్టు అండ్ డ్రగ్గిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీనియర్ల సలహాలు, సూచనలు తీసుకొని సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. గతంలో జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన జగదీశ్వర్, కోశాధికారిగా పని చేసిన రమేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, కోశాధికారి మధుసూదన్, జిల్లా ప్రధాన కార్యదర్శి యోగేశ్వర్, కోశాధికారి నాగేశ్వర్‌రావు, రిటైల్ షాపుల సంఘం కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ లోక్ అదాలత్‌కు సహకరించాలి

నిజామాబాద్ : ఈ నెల 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి పోలీసులు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి సూర్యచంద్రకళ తెలిపారు. జిల్లా కోర్టులోని న్యాయసేవా సంస్థ భవన్‌లో కోర్టు కానిస్టేబుళ్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి పోలీసు స్టేషన్ తరపున ఫిర్యాదుదారులకు, నిందితులకు జాతీయ లోక్ అదాలత్ సమాచారం ఇవ్వాలని, లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకునే క్రిమినల్ కేసులను వారికి వివరించాలన్నారు. దీని ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు.

## ఘనంగా మంత్రి రామన్న జన్మదిన వేడుకలు

ఎదులాపురం : మంత్రి జోగు రామన్న జన్మదిన వేడుకలను ఆదిలాబాద్ పట్టణంలో తెరాస శ్రేణులు, స్వచ్ఛంద సంస్థల వారు ఘనంగా వేడుకగా జరుపుకొన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్(బీఎఫ్‌హెచ్‌డబ్ల్యూ) సొసైటీ వారు మాత్రం విభిన్నంగా రక్తదానం చేయటంతో పాటు పేదలకు దస్తులను పంపిణీ చేశారు. ఈ సంఘం ఆధ్వర్యంలో కేక్ కోసి ఒకరికొకరు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం రిమ్స్ రక్తనిధి కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి పలువురు సభ్యులు రక్తదానం చేశారు. పేద మహిళలకు చీరలు, విద్యార్థులకు పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పుర అధ్యక్షురాలు రంగినేని మనీష ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో సభ్యులు శశికళ చౌహాన్, పృథ్వీ ప్రమోద్, సాజిద్, లోఖండె అనిల్, అబ్దుల్ అజీమ్, శశికాంత్, జె.పవన్, తదితరులు రక్తదానం చేశారు.

*ఖమ్మం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 200 సీట్ల భర్తీకి గాను 400 మంది విద్యార్థులు కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. ఖమ్మం నగరంలోని ఎన్ఎస్‌పీ క్యాంపు అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా సమన్వయకర్త పుల్లయ్య ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ ప్రక్రియను ప్రారంభించారు*

## బాధ్యులపై కఠిన చర్యలు

ఇంద్రవెల్లి : జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన అంతర్గత రహదారుల నిర్మాణంలో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రాథోడ్ రాజేశ్వర్ అన్నారు. జిల్లా పాలనాధికారి బుద్ధప్రకాశ్ ఎం.జ్యోతి స్పందించారు. దీనిపై వెంటనే పూర్తి విచారణ జరపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా తీసుకొచ్చిన గొట్టాలు(పైపులు), రహదారులను డీఆర్డీఓ రాజేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు, మూడేళ్లుగా అంతర్గత రహదారుల నిర్మాణానికి అవసరమైన గొట్టాలు తీసుకొచ్చి వృథాగా పడేయడంతో పాటు రహదారుల నిర్మాణ పనులు పూర్తయినట్లు నివేదికలు పంపించారని పేర్కొన్నారు. ఈ విషయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను రెండ్రోజుల్లో సమర్పించాల్సిందిగా ఎంపీడీఓలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇంద్రవెల్లి మండలంలో ఆయా గ్రామాల్లోని ఆరు రహదారులను, పడేసిన గొట్టాలను స్వయంగా పరిశీలించినట్లు వివరించారు. ఆయన వెంట ఎంపీడీఓ రమాకాంత్, ఉపాధిహామీ సాంకేతిక సిబ్బంది అమర్‌సింగ్, శ్రీనివాస్, ధన్‌రాజ్ సజిత, రజిత ఉన్నారు. ఉపాధి రహదారులు, పైపుల విషయంలో వాస్తవాలను వెలికి తీసిన ఈనాడుకు ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు కృతజ్ఞతలు తెలిపారు.

### భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

ఆదిలాబాద్ : ఆషాఢ మాసం తొలి ఏకాదశిన జిల్లాలోని ప్రధాన ఆలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచే అన్ని ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని గోపాలకృష్ణ మఠం, శాంతినగర్‌లోని షిర్డీసాయి మందిరం, అంబేడ్కర్ కూడలి సమీపంలోని వేంకటేశ్వరాలయంతో పాటు అన్ని మందిరాల్లో భక్తులు పూజలు చేశారు. ఫలాలు నైవేద్యం సమర్పించారు. విష్ణుమూర్తి యోగనిద్రకు ఉపక్రమించే రోజు ఇదే కావడం, నాలుగు నెలల తర్వాత అంటే కార్తీక శుద్ధ ఏకాదశిన మేల్కొంటాడని పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ పవిత్రమైన రోజున మహిళలు ఉపవాస వ్రతాలు ప్రారంభిస్తారు. ఈ నాలుగు నెలలు ఆధ్యాత్మిక చింతనలో ఉండటం శుభసూచకంగా భావిస్తారు

## జిల్లాలో 1.95 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం

**- డీఆర్‌డీవో మురళీధర్‌రావు**



కూసుమంచి : హరిత తెలంగాణ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూడో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల్లో 1.95 కోట్ల మొక్కలను నాటడమే లక్ష్యంగా నిర్దేశించినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మురళీధర్‌రావు అన్నారు. కూసుమంచి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం హరితహారంపై ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ.. జిల్లాలో అటవీశాఖ ద్వారా 50 లక్షలు, ఐటీసీ ద్వారా 45 లక్షలు, సింగరేణి ద్వారా 5 లక్షలు, వ్యవసాయశాఖ ద్వారా 80 లక్షల టేకు వేర్లు, మిగతా ఉపాధిహామీ నర్సరీల ద్వారా మొక్కలను సమకూర్చుతున్నట్లు వెల్లడించారు. మొక్కలు నాటడానికి ముందు ఇంటి పరిసరాలను మినహాయించి వ్యవసాయ క్షేత్రాల్లో, ప్రభుత్వ రంగ స్థలాల్లో నాటే మొక్కల సంఖ్యను అంచనా వేసుకోవాలని సిబ్బందికి సూచించారు. దీంతో మొక్కలు నాటేందుకు, గుంతల తవ్వకానికి, అనంతరం వాటి నిర్వహణకు ఉపాధిహామీ ద్వారా వెచ్చించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటివరకు 3.70 లక్షల మొక్కలకు మాత్రమే అంచనా ప్రతిపాదనలు అయినట్లు చెప్పారు. మొక్కలు నాటడం, వాటి పెంపకం సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతీ ఒక్కరు కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 55 నుంచి 60 వేల వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని ఆయన చెబుతూ.. అందులో 9 వేల వరకు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. సంపూర్ణ పారిశుద్ధ్య జిల్లాగా నిలిచేందుకు గ్రామ పంచాయతీ సర్పంచులు చొరవచూపాలని కోరారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. హరితహారంలో గతేడాది నాటిన మొక్కల్లో కేవలం 20 శాతం మాత్రమే మిగిలాయని, ఈ దఫా 90 శాతానికి పైగా మొక్కలు కాపాడుకునేందుకు అన్ని శాఖల అధికారులు, ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లా వె%ద్యాధికారి డాక్టర్ కొండల్‌రావు, జిల్లా మలేరియా నివారణాధికారి రాంబాబు మాట్లాడుతూ.. తరుణ వ్యాధుల పట్ల ప్రజలు, వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్లలో నీరు నిల్వకుండా, దోమలు పెరగకుండా జాగ్రత్త వహిస్తే అనారోగ్య పరిస్థితులకు దూరంగా ఉండవచ్చన్నారు. సమావేశంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రమీల, ఏపీడీ అశోక్, ఎంపీడీవో విద్యాచందన, తహసీల్దార్ కృష్ణ, మండల వె%ద్యాధికారిణి కృష్ణవేణి, ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, సర్పంచులు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్తు ఒప్పంద కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి




అలంపూర్ : రాష్ట్రంలో 23 వేలకు పైగా ఒప్పంద కార్మికులు విద్యుత్తు శాఖలో పని చేస్తున్నారని వారికి ప్రభుత్వం నుంచి న్యాయం జరుగుతుందని 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబు అన్నారు. అలంపూర్ విద్యుత్తు సబ్‌డివిజన్ కార్యాలయంలో ఎల్‌ఐ నారాయణ పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒప్పంద కార్మికులను తప్పనిసరిగా ప్రభుత్వం విలీనం చేసుకునేందుకు సిద్ధంగా ఉందని,ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతుందన్నారు. 352 జేఏవో పదోన్నతులకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లాకు 70 మంది లైన్‌మెన్‌లు, 100 ఎస్-ఎల్‌ఐ పదోన్నతి పోస్టులు రానున్నట్లు ఆయన వివరించారు. ఏపీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి వారిని ఖాళీగా కూర్చోబెట్టి జీతాలు చెల్లిస్తున్నారని ఆరోపించారు. విద్యుత్తు శాఖలో కింది స్థాయి సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. పదవీవిరమణ పొందిన నారాయణను సన్మానించారు.

1989 తరువాత ప్రస్తుతం విద్యుత్తుశాఖలో ట్రేడ్ యూనియన్లకు ఎన్నికలు రాబోతున్నాయని, 1104 యూనియన్ కార్మికులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన కారదర్శి సాయిబాబు పేర్కొన్నారు. ఈ సభవేదిక నుంచే ఎన్నికలకు శంఖారావం పూరించాలన్నారు. జులై 22న నోటిఫికేషన్ రానుందని, ఆగస్టు 8 ఎన్నికలు జరగబోతున్నట్లు ఆయన తెలిపారు. విశ్రాంత సీజీఎం రాజగోపాల్ శెట్టి, నాయకులు శాలన్న, రవికుమార్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రామచంద్రనాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడు స్వామి, అదనపు కార్యదర్శి యుగేందర్‌రెడ్డి, గద్వాల డివిజన్ అధ్యక్షుడు నరసింహ్మా, బి.ఉదయ్‌కిరణ్, మద్దిలేటి, అశోక్, వనపర్తి డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి బాలప్రతాప్, నాగర్‌కర్నూల్ డివిజన్ కార్యదర్శి సత్యచారీ, మహబుబ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి పాండునాయక్, ఏఈలు నరసింహ్మప్రసాద్, సుబ్బారాయుడు, విలియంకేరి, కార్మికులు పాల్గొన్నారు.

## ఆటోడ్రైవరే చోరుడు




ఆదిలాబాద్ : బంధువుల శుభకార్యానికని ఇద్దరు సోదరులు కుటుంబాలతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. ఇంటికి తాళాలువేసి ఆటోను పిలిపించారు. వెళ్లే ముందు గేటుకు తాళంవేసి బస్సు వరకు ఆ ఆటోలో వెళ్లారు. ఎందుకైనా మంచిదని ఆటో నంబర్ రాసుకున్నారు. రాత్రి వెళ్లిన వారింట్లో దొంగలు పడ్డారని ఉదయం బయటపడింది.. పోలీసులు వారు వెళ్లిన ఆటో డ్రైవర్‌ను విచారించగా పాత నేరస్థుడు కావడంతో చోరీ వివరాలన్ని వెల్లడించారు. అతడే నిందితుడని తేలింది. ఈ మేరకు ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీసీఎస్ డీఎస్పీ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని కుమార్‌పేట్ కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధికల్పనశాఖాధికారి నరేందర్, ఆయన సోదరుడు నర్సింగ్ కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. సమీపంలో ఉన్న ఆటోను పిలిపించి ఇంటినుంచి బస్సువరకు అందులో బయలుదేరి వెళ్లారు. ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో చోరీ విషయం వెలుగుచూసింది. మొత్తం 16 తులాల బంగారం, రూ.25 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితులు డ్రైవర్‌పై అనుమానం వ్యక్తంచేస్తూ ముందుగా రాసుకున్న ఆటో నెంబర్ పోలీసులకు ఇచ్చారు. పైగా కొత్తగా అమల్లోకి వచ్చిన ఈ బీట్ పద్ధతితో వీడియో తీసిన నేపథ్యంలో ఆ వీడియోలో ఆటో అనుమానాస్పదంగా పలుమార్లు తిరిగినట్లు పోలీసులు గమనించారు. అదే ఆటో కావడంతో వన్‌టౌన్, సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగి డ్రైవర్‌ను పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడు మోయిజ్(22) గతంలోనూ పలు దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆటో డ్రైవర్‌గా అవతారమెత్తి దొంగతనాలకు పాల్పడుతున్నాడని వివరించారు. 40కుపైగా చోరీ కేసుల్లో నిందితుడని తెలిపారు. 24 గంటల్లో దొంగను పట్టుకున్నందుకు జిల్లా ఎస్పీ శ్రీనివాస్ పోలీసులను అభినందిస్తూ రివార్డు ప్రకటించారని చెప్పారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రధాన పాత్ర పోషించిన వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ సురేషన్‌ను అభినందించారు. నిందితుడి నుంచి 73 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండి, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు.

## పోలీసు బందోబస్తు మధ్య మిర్చి కొనుగోళ్లు



ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా జరిగాయి. వర్తక సంఘం నిరవధిక బంద్‌కు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో కొనుగోళ్లు నిలిచిపోవటంతో మార్కెట్ కమిటీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. ఇక్కడ కార్మికులు సోమవారం బంద్‌లో పాల్గొనటంతో కొనుగోళ్లకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం మధిర, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్‌ల నుంచి 45మంది హమాలీలను రప్పించారు. కొనుగోలు చేసిన సరకు రవాణా చేయటానికి ప్రైవేటు ట్రాలీలను ఏర్పాటు చేశారు. శీతలగిడ్డంగులు సోమవారం మూతపడ్డాయి. వీటిని కూడా తెరిపించి సుమారు 1000బస్తాల మిర్చిని కొనుగోలు చేశారు. రైతుల నుంచి తెచ్చిన నాన్‌ఏసీ మిర్చి సుమారు 700బస్తాల వరకు కొనుగోలు చేశారు. వ్యాపారులను కూడా మార్కెట్‌కు రప్పించి సరకు కొనుగోలు చేశారు. బంద్‌లో ఉన్న వ్యాపారులు కొనుగోలు చేయకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మరో వె%పు ముదిగొండలోని చెంగ్‌వాంగ్ కంపెనీకి మిర్చిని ఇక్కడి నుంచి కొనుగోలు చేస్తున్న ఏజెన్సీలను బుధవారం రప్పించటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందు కోసం చె%నా కంపెనీపై ఒత్తిడి పెంచుతున్నారు. చె%నా కంపెనీ రోజుకు 4వేల నుంచి 5వేల బస్తాల వరకు సరకు కొనుగోలు చేస్తే ఇక్కడికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని మార్కెట్ పాలకవర్గం, అధికారులు భావిస్తున్నారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఆర్‌జేసీ కృష్ణ ఇక్కడి సమాచారాన్ని ఎప్పటికప్పుడు రాష్ట్ర ఉన్నతాధికారులకు వివరిస్తున్నారు. కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆయన మార్కెట్‌లో ఉండి పర్యవేక్షణ చేస్తున్నారు. ఏసీపీ గణేశ్ కూడా మార్కెట్‌లో శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు. పత్తి యార్డు, అపరాల యార్డు, మిర్చి యార్డుతో పాటు మార్కెట్ పరిసరాల్లో ఎక్కడ చూసినా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మిర్చి మినహా అపరాలు, పత్తి సరకు మార్కెట్‌కు రాలేదు. దీంతో ఈరెండు యార్డులు కూడా వెలవెలబోయాయి.

విజయభాను

సంపాదకీయం

## పెద్దల పర్యవేక్షణ ఉండాలి

యువతలోని ఉద్రేకాలే పెట్టుబడిగా పెడ ధోరణులెన్నో ఇవ్వాళ రాజ్యమేలుతున్నాయి. అందులో ఆధునిక టెక్నాలజీ పేరుతో అందుబాటులోకి వచ్చిన ఇంటర్నెట్ లాంటివి యువతను నిర్వీర్యం చేస్తున్నాయి. సాంస్కృతిక పతనానికి ప్రధాన హేతువుగా మారుతున్నాయి. ఏడెనిమిది తరగతులు చదివే విద్యార్థి నుంచి ఇవ్వాళ స్మార్ట్ ఫోన్లు జేబులో పెట్టుకొని కాలం వెళ్లబుచ్చుతున్నారు.

చదువులతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన విద్యార్థులు లేలేత వయస్సులోనే మత్తుకు చిత్తవుతున్న తీరు సమాజాన్ని భయకంపితుల్ని చేస్తున్నది. ఎక్కడో విదేశాల్లోనో, మెట్రో పాలిటన్ నగరాల్లోనో ఉంటుందనుకున్న ప్రమాదకర మాదక ద్రవ్యాలు నగర విద్యార్థులను బలి తీసుకుంటున్న వైనం అందరినీ కలవరపరుస్తున్నది. ఏళ్లుగా నగరంలో మాదక ద్రవ్యాల ముఠాలు చాపకింది నీరులా విస్తరిస్తున్నాయన్న అనుమానాలున్నాయి. మాదక ద్రవ్యాలకు హైదరాబాద్ అడ్డాగా మారిందని తాజా ఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి. కెల్విన్ మాస్కెరాన్స్ ముఠా చేతిలో దాదాపు వెయ్యిమంది పాఠశాల విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారినతీరు చూసి నగరవాసులు వణికిపోతున్నారు. మాస్కెరాన్స్ మాదక ద్రవ్యాల రాకెట్ గుట్టుచప్పుడు కాకుండా అమెరికా నుంచి కొరియర్‌లో ఎల్ఎస్‌డీ, ఎండీఎంఏ లాంటి ఖరీదైన మత్తు పదార్థాలను దిగుమతి చేసుకుంటున్నది. ఉన్నతవర్గాలు, వారి పిల్లలే లక్ష్యంగా చేసుకొని ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థులకు చేరవేస్తూ విద్యార్థులను మత్తుకు బానిసలను చేస్తున్నది.

ఈ మధ్యనే చేసిన ఒక అధ్యయనం ప్రకారం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఎక్కువగా మాదక ద్రవ్యాలు వినియోగంలో ఉన్నాయి. తాజా అధ్యయనంలో తేలిందేమంటే మాదక ద్రవ్యాల బారిన పడిన రాష్ట్రాలు పన్నెండింటిలో తెలంగాణ కూడా ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. ఇక పంజాబ్ రాష్ట్రమైతే మత్తుమందుకు బానిసైన ప్రాంతంగా దేశవ్యాప్తంగా చర్చల్లోకి వచ్చింది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ప్రతిరోజూ పంజాబ్‌లో పదిమంది మదకద్రవ్యాలకు బానిసలై చనిపోతున్నారు. జాతీయ నేర గణాంకశాఖ లెక్కల ప్రకారం దేశంలో నానాటికీ మాదక ద్రవ్యాల పీడితుల సంఖ్య పెరిగిపోతున్నది. ఒక స్వచ్ఛంద సంస్థ అధ్యయనం ప్రకారం మాదక ద్రవ్యాల బానిసలుగా చికిత్సకు వస్తున్న 63 శాతం రోగుల్లో 15 ఏళ్లలోపు పిల్లలు కూడా ఉంటున్నారని తెలిపింది. ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వాలు దీనిపై ప్రత్యేక దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని సూచించింది. ఐక్య రాజ్యసమితి కూడా మాదకద్రవ్యాల ప్రమాదాన్ని అన్ని దేశాలూ తీవ్ర సమస్యగా తీసుకోవాలని సూచించింది. ఆధునిక సమాజంలో మానవాళిని పీడిస్తున్న వాటిలో ఉగ్రవాదం తర్వాత మాదక ద్రవ్యాల ప్రమాదమే అతిపెద్దదని తెలిపింది. మారిజౌనా, కొకైన్, బ్రౌన్ షుగర్, గంజాయి, ఎల్ఎస్‌డీ, ఎండీఎంఏ లాంటి మత్తు పదార్థాలు ప్రజలను ముఖ్యంగా యువతను బలితీసుకుంటున్నదని హెచ్చరించింది. ప్రభుత్వాలు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల పట్ల కఠినంగా వ్యవహరించాలి.

ఈ క్రమంలో వారు స్మార్ట్ ఫోన్‌లో చూస్తున్నదంతా పోర్న్ మాత్రమేనని ఎన్నో అధ్యయనాలు చెబుతున్నాయి. ఒక ఏడో తరగతి అబ్బాయి తన తల్లిదండ్రుల ఏకాంత దృశ్యాలను వీడియో తీసి తన మిత్రులతో షేర్ చేసుకున్నాడంటే ప్రమాద తీవ్రత అర్థం చేసుకోవాల్సిందే. ఈ క్రమంలోనే ఎంతోమంది బాల్యంలోనే మానసిక రోగులుగా మారుతున్న తీరు కనిపిస్తున్నది. వీటన్నింటికీ సామాజిక పరిస్థితులకు తోడు కుటుంబ జీవనం కూడా కారణమవుతున్నది. పిల్లలకు ఐదారేళ్లు వచ్చాయనగానే ప్రత్యేక గదులు కేటాయించే నాగరిక సంస్కృతి ఒకటి ఉన్నది. దీంతో ఆ విద్యార్థులు ఒంటరిగా రాత్రంగా ఏం చేస్తున్నారో చూసే తీరిక, ఓపిక నేటి తల్లిదండ్రులకు ఉండటం లేదు. ఈ నేపథ్యంలోంచే విద్యార్థి దశలోనే విపరీత అలవాట్లకు, వ్యసనాలకు బానిసలవుతున్న తీరు కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలోంచే రాష్ట్ర ప్రభుత్వం పబ్బులు, క్లబ్బులపై ఉక్కుపాదం మోపి అసాంఘికశక్తుల ఆట కట్టిస్తున్నది. తాజా కెల్విన్ మాస్కెరాన్స్ డ్రగ్ రాకెట్‌లో కూడా కీలక నిందితులందరినీ అరెస్టుచేసి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు హర్షణీయం. మరోవైపు విద్యార్థుల దైనందిన జీవితాచరణపై కుటుంబ పెద్దల పర్యవేక్షణ ఎల్లవేళలా ఉండాల్సిన అవసరాన్ని తాజా ఘటనలు రుజువుచేస్తున్నాయి. యువత మాదకద్రవ్యాల బారినపడకుండా అటు కుటుంబం, ఇటు ప్రభుత్వం కలిసికట్టుగా కృషిచేయాలి. యువత భవిష్యత్తును తీర్చిదిద్దటంలో సమాజం, కుటుంబ పాత్రే ప్రధానమన్నది మరువరాదు.

# స్టాలిన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

గుమ్మిడిపూండి : ప్రతి కార్యకర్త డీఎంకే నిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు జిన్నా తెలిపారు. గుమ్మిడిపూండి సమీపంలోని కవరప్పేటలో జిల్లా డీఎంకే యువజన విభాగ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిన్నా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్టాలిన్ పిన్న వయస్సులో పార్టీ సభ్యత్వం తీసుకుని రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, కోశాధికారి, చెన్నై కార్పొరేషన్ మేయర్, ఉప ముఖ్యమంత్రి, పార్టీ నిర్వాహక అధ్యక్షుడు, ప్రస్తుతం శాసన సభలో ప్రతి పక్ష నాయకుడిగా... ఇలా అంచెంచెలుగా ఎదిగారని గుర్తుచేశారు. ఎమర్జెన్సీ సమయంలో అరెస్టు అయి సుమారు రెండేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలు ఆయన్ను ఆదర్శంగా తీసుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు లోకేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రారంభోత్సవంలో మలేషియా నృత్యకారిణులు



భువనేశ్వర్ : ఈ నెల 6 నుంచి కళింగ స్టేడియంలో జరగనున్న ఆసియన్ అథ్లెటిక్ పోటీలు ప్రారంభోత్సవంలో భాగంగా బుధవారం రాష్ట్రానికి చెందిన 400 మందికిపైగా కళాకారులతోపాటు మలేషియాకు చెందిన ఏడుగురు కళాకారులు నృత్యాలు ప్రదర్శిం చనున్నారు. మలేషియా నృత్యకారులుభువనేశ్వర్ చేరుకుని కళింగస్టేడియంలో అభ్యసన చేశారు.

**స్టేడియం రహదారిలో వ్యాపార సంస్థల మూసివేత**

బుధవారం సాయంత్రం కళింగ స్టేడియంలో ఆసియన్ అథ్లెటిక్ పోటీలు ప్రారంభోత్సవం జరగనుంది. వీటిని తిలకించేందుకు వేలాదిగా క్రీడాభిమానులు హాజరవనున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవకుండా బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 10 గంటల వరకు కళింగ స్టేడియం రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార సంస్థలు మూసివేయాలని కమిషనరేట్ పోలీసులు వ్యాపారులకు విన్నపించారు. వ్యాపారులు కూడా పోలీసులకు సహకరించేందుకు అంగీకరించారు. పోలీస్ కమిషనర్ వై.బి.ఖురానియా మీడియాతో మాట్లాడుతూ వ్యాపార సంస్థలు ఉండడం సాధారణ రోజుల్లో కళింగ స్టేడియంకు సంధించే మార్గాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.

జయదేవ్ విహార్-చంద్రశేఖర్‌పూర్ మార్గం, స్టేడియం-సచివాలయం మార్గం, విద్యుత్తు మార్గ్-జనపథ్ మార్గం, రాజ్‌మహల్-శిశుభవన్ మార్గాల్లో ఉన్న వ్యాపార సంస్థలు బుధవారం తెరవ కూడదని వ్యాపారులకు విన్నపించినట్లు తెలిపారు. ఈ విష యమై వారు కూడా అంగీకరించినట్లు పేర్కొన్నారు.

### కమల్ 'ఒక్కరోజు ముఖ్యమంత్రి' అవ్వాలి ఆనంద్ శంకర్

చెన్నై : విశ్వనటుడు కమల్‌హాసన్ ఒక రోజు ముఖ్యమంత్రి అవ్వాలని దర్శకుడు ఆనంద్ శంకర్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న పరిస్థితుల ద ృష్ట్యా కమల్ హాసన్ ఒక రోజు ముఖ్యమంత్రి అయితే బావుంటుందన్నారు. ఈ విషయమై ఆయన సామాజిక మాధ్యమంలో స్పందిస్తూ 'ముదల్వన్' (ఒకే ఒక్కడు)లో మాదిరి రాష్ట్రానికి ఒకరోజు సీఎం అయ్యే ఆస్కారముంటే కమల్‌హాసన్ ఆ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఆయన తన ఆలోచనల దృష్ట్యా ఒక రోజులో రాష్ట్రాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్లగలరని పేర్కొన్నారు. ఇది జరిగే అవకాశం కూడా ఉందన్నారు. ఇది కేవలం తన అభిప్రాయం మాత్రమేనని, చిన్నతనంగా ఉంటే క్షమించాలని పేర్కొన్నారు.

### పోటీల నిర్వహణ ఛాలెంజ్‌గా నిలిచింది

**క్రీడలశాఖ మంత్రి చంద్రసారథి బెహర**

భువనేశ్వర్ : ఆసియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల నిర్వహణ క్రీడలశాఖ ఛాలెంజ్‌గా తీసుకుందని క్రీడల శాఖ మంత్రి చంద్రసారథి బెహర అన్నారు. ఇడ్కో, బీఎంసీ, నిర్మాణాల శాఖ, విద్యుత్తుశాఖ అధికారులతో సమన్వయం ఏర్పాటు చేసుకుని స్టేడియంను సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ పోటీలు ఒడిశాకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఏర్పర్చుతుందని అన్నారు. పోటీలు విజయవంతంగా జరిపేందుకు అందరి సహకారం అవసరమన్నారు. ఈ పోటీలు నిర్వహణకై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, ప్రధాన కార్యదర్శి ఆదిత్య పాఢి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు సహకారం ఎంతో ఉందన్నారు. ఏర్పాట్లలో 60మంది ఓఏఎస్ అధికారుల పాత్ర ఉందన్నారు. స్టేడియంలో రూ.10కోట్లు వ్యయంతో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. ఇడ్కో సంస్థ గ్యాలెరీలను తీర్చిదిద్దింది. పోటీలు నిర్వహణకై ప్రభుత్వం రూ.100కోట్లు మంజూరు చేసింది. కళింగ స్టేడియం ఆధునీకీకరణ, స్టేడియంకు సంధించే మార్గాల మరమ్మత్తులు, నగర సౌందర్యీకరణ వంటి పనులు జరిపామని పేర్కొన్నారు.

# విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఇస్తాం

## ఎమ్మీ భర్తృహరి మెహతాబ్



కటక్ : ఈ ఏడాది నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఏడాదికి రెండు జతల ఏకరూప దుస్తులు (యూనిఫారాలు' అందిస్తామని ఎమ్మీ మెహతాబ్ తెలిపారు.

పాఠశాలలకు దూరమవుతున్న విద్యార్థులను గుర్తించి వారిని మళ్లీ పాఠశాలల వైపు మళ్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో వివిధ పాఠశాలల్లో 86 శౌచాలయాలు నిర్మి స్తామని, వసతి గృహాలు నిర్మించి పాఠశాలల్లో వసతులు పెంచుతామని వివరించారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో సర్వశిక్షా అభిజాన్ జాతీయ మాధ్యమిక శిక్ష్యా అభిజాన్, మధ్యాహ్న భోజనం కార్యక్రమాలపై జిల్లాస్థాయి మాని టరింగ్ కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ ఎన్.సి.మిశ్ర, కటక్ ఎమ్మీ భర్త ృహరి మెహతాబ్, జిల్లా శిక్షా అధికారి నిరంజన్ బెహర తదితరులు పాల్గొని సమీక్షిం చారు. అనంతరం ఎమ్మీ విలేఖరులతో మాట్లాడారు.

2017-18 ఆర్థిక సంవత్సరంలో జిల్లాల్లో గల పాఠశాలల్లో వసతులు కల్పించేందుకు రూ.74.82 కోట్లు ఖర్చు చేస్తా మన్నారు.

సమావేశంలో మాజీ మంత్రి దేవిప్రసాద మిశ్ర, శాసనసభ్యుడు ప్రమోద్ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

కవి సమయం

## దుష్టులకు దూరంగా వుండవలెను

దుష్టులతో స్నేహం చేస్తే మనకూ అదే విధమైన పేరు వస్తుంది. మీరు మంచివారయినా మీ సావాసగాళ్ళు చెడ్డవారైతే మిమ్మల్ని కూడా చెడ్డవారిగానే ఈ లోకం పరిగణిస్తుంది. తాడిచెట్టు క్రింద కూర్చుని పాలు త్రాగినా కల్లు తాగుతున్నాడనే అంటారు. అంటే దుష్టుల ఛాయకు అంత చెడ్డపేరు వుందన్నమాట. చెడ్డవారితో స్నేహం మొదలు బాగానే వుంటుంది. కానీ చివరకు వ్యసనాలను, అనేకమైన ఇతర దుర్గణాలనూ నేర్పిస్తుంది. కాబట్టి చెడ్డవారికి దూరంగా వుండటం మంచిది. ఈ విషయాన్ని ఓ వేమన పద్యం ద్వారా విందాం.

'కానివానితోడు గలసి మెలుగుచున్న
గానివానివలెనె కాంతురవని
తాడిక్రిందుబాలు త్రాగిన చందమౌ
విశ్వదాభిరామ వినురవేమ'

... రచయిత
వడ్లమాని అన్నపూర్ణ

## పంచాంగం

మాసం : ఆషాడం; తిథి: త్రయోదశి రా.తె. 04-43
అనూరాధ ఉ. 09-00 వ.మ.03-12ల 04-58

గురువారం
06-07-2017

**మేషం :** ఏ విషయంలోను ఒంటెద్దు పోగడ మంచిది కాదు. మీ శ్రీమతి మొండివైఖరి మీకు చికాకు కలిగిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం. బేకరి, పండ్ల, స్వీట్ వ్యాపారాలు జోరుగా సాగుతాయి. గృహోపకరణాలు, వాహనం అమర్చుకుంటారు.

**వృషభం :** ఒక కార్యం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేస్తారు. చీటికి, మాటికి ఎదుటివారిపై అసహనం ప్రదర్శిస్తారు. హోటల్, క్యాటిరింగ్ పనివారలకు సదవకాశాలు లభిస్తాయి. ఒక వేడుకను ఘనంగా నిర్వహించటానికి యత్నాలు మొదలెడతారు. కొంత మంది మీ పలుకుబడి ద్వారా లబ్ధి పొందుతారు.

**మిథునం :** ఓర్పు, నేర్పుతో అనుకున్నది సాధిస్తారు. నూతన ప్రదేశాలు సందర్శనలు అనుకిలిస్తాయి. వృత్తుల వారు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటం మంచిది. కోర్టు వ్యవహారాలు, భూ వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఉద్యోగస్తులకు రావలసిన క్లయింలు, అలవెన్సులు ఆలస్యంగా అందుతాయి.

**కర్కాటకం:** బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బందులను ఎదుర్కొంటారు. గతంలో పోల్చుకుంటే ప్రస్తుత ఆర్థికస్థితి కొంత మెరుగనిపిస్తుంది. వైద్య రంగాల వారికి గుర్తింపు, కీర్తి ప్రతిష్టలు లభిస్తాయి. ఆడిట్, అకౌంట్స్ రంగాల వారికి పని ఒత్తిడి, చికాకులు తప్పవు.

**సింహం:** స్త్రీలకు అలంకారాలు, విలాస వస్తువుల మీద మక్కువ పెరుగుతుంది. సంఘంలో మీ కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. దీర్ఘకాలిక సమస్యల శాశ్వత పరిష్కారానికి బాగా శ్రమిస్తారు. అకాల భోజనం, శారీరక శ్రమ వంటి ఇబ్బందులెదుర్కొంటారు. ఇసుక, క్వారీ కాంట్రాక్టర్లకు ప్రభుత్వాధికారుల నుంచి వేధింపుల తప్పవు.

**కన్య:** రాజకీయ నాయకులు సభ, సమావేశాల్లో పాల్గొంటారు. మనోధైర్యంతో యత్నాలు సాగించాల్సి ఉంటుంది. ఏజెంట్లు, బ్రోకర్లు, వృత్తుల వారికి సదవకాశాలు లభిస్తాయి. బంధుమిత్రుల నుంచి ఒత్తిడి, మొహమ్మాటాలు ఎదుర్కొంటారు. ప్రముఖ ఆలయాల్లో దైవదర్శనాలు అతికష్టం మీద అనుకూలిస్తాయి.

**తుల:** ఒక స్థిరాస్తి విక్రయించాలనే ఆలోచన స్ఫురిస్తుంది. ధనవ్యయం అధికంగా ఉంటుంది. మార్కెట్ రంగాల వారు టార్కెట్లను సునాయాసంగా పూర్తి చేస్తారు. క్యాటరింగ్ పనివారలకు సదవకాశాలు లభిస్తాయి. మీ భావాలు, ఆలోచనలకు మంచి స్ఫూర్తి లభిస్తుంది. కోర్టు వ్యవహారాలలో ప్లీడర్లకు చికాకులు అధికమవుతాయి.

**వృశ్చికం:** ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఒత్తిడి అధికం. ఆర్థిక లావాదేవీలు, కుటుంబ విషయాల పట్ల శ్రద్ధ వహిస్తారు. ప్రింటింగ్ రంగాల వారికి మందకొడిగా ఉంటుంది. మీ జీవిత భాగస్వామి సలహా మీకెంతగానో నచ్చుతుంది. పత్రిక, వార్తా సంస్థలలోని వారి ఏమరుపాటుతనం వల్ల స్వల్ప ఇబ్బందులు తప్పవు.

**ధనుస్సు:** ఎంత శ్రమించినా ఆదాయం అంతంత మాత్రంగానే ఉంటుంది. స్త్రీలకు షాపింగ్‌లోను, పనివారల విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. నిరుద్యోగులు వచ్చిన తాత్కాలిక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటం శ్రేయస్కరం. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలుదార్లను ఆకట్టుకుంటారు.


**మకరం:** ఆడిట్, అకౌంట్స్ రంగాల వారికి పని ఒత్తిడి, చికాకులు తప్పవు. బంధువులతో చిన్న చిన్న కలహాలు జరిగే ఆస్కారం ఉంది. రవాణా రంగాలలో వారికి మిశ్రమ ఫలితం కానవస్తుంది. ప్రముఖుల పరిచయాలు, పాత మిత్రుల కలయిక మీ ఉన్నతికి దోహదపడతాయి. ఆదాయానికి సరిపడని ఖర్చు కానవస్తుంది.

**కుంభం:** దూర ప్రయాణాలలో వస్తువుల పట్ల మెళుకువ అవసరం. హామీలు, చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి. ఇంజనీరింగ్, మెడికల్, కంప్యూటర్, శాస్త్ర రంగాల వారికి పురోభివృద్ధి. ముఖ్యమైన పర్యటనలలో అవాంతారాలు ఎదురైనా జయం పొందుతారు. సమయాన్ని వృధా చేసే కొలది నష్టాలను ఎదుర్కొంటారు.

**మీనం:** వ్యాపారాల్లో నష్టాలు, ఆటంకాలు క్రమేణా అధికమిస్తారు. స్త్రీలపై సన్నిహితులు, చుట్టుపక్కల వారి ప్రభావం అధికంగా ఉంటుంది. వాహనం నిదానంగా నడపటం క్షేమదాయకం.

# షిర్డీ 'సాయిబాబా' జీవిత చరిత్ర

సంకీర్తన



( గత తరువాయి)

పట్టి ఓడిపోయిన తరువాత బాబాలో చాలా మార్పు వచ్చింది. సూఫీ ఫకీరులలాగా మోకాళ్ళ వరకు ఉండే 'కఫనీ', తలకు టోపీలాగా చుట్టిన గుడ్డ ధరించడం మొదలుపెట్టారు. ఇలా ముస్లిం ఫకీరులా ఉండే బాబాకు స్థానిక హిందువులనుండి కొద్దిపాటి ప్రతిఘటన కూడా ఎదురయ్యింది. 1918లో తన మరణం వరకు సాయిబాబా షిరిడీలోనే ఉన్నారు. ఒక పాత మసీదును తన నివాసం చేసుకొన్నారు. యాచన అతని వృత్తి. మసీదులో ధునిని వెలిగించారు. అందులోనుండి విభూతిని తీసి తన దర్శనానికి వచ్చేవారికి పంచేవారు. అది తమకు రక్షణ ఇస్తుందని భక్తులు నమ్మేవారు. వచ్చిన వారికి ఉపదేశాలు, ధర్మ బోధలు చేసేవారు. చాలా మహత్తులు చూపించే వారని భక్తులు చెబుతారు. స్వయంగా వండి ప్రసాదాన్ని పంచేవారు. ఉత్సవాలలో పాల్గొనేవారు. ఒకోమారు విపరీతంగా కోపం చూపేవారు.

1910 తరువాత సాయిబాబా పేరు దేశమంతటా తెలిసింది. గొప్ప మహత్తులు చూపే సాదువనీ, లేదా అవతారమని విశ్వసించే భక్తులు పెక్కురు బాబా దర్శనానికి రాసాగారు.16 అక్టోబరు 15, 1918 మధ్యాహ్నం 2.30కి బాబా తన భక్తుని వడిలో మహా సమాధి చెందారు. ఆయన దేహం బూటెవాడలో ఖననం చేయబడింది. అక్కడే 'సమాధి మందిరం' నిర్మించబడింది.

**ముఖ్యమైన శిష్యులు**

సాయిబాబా తన మార్గానికి, ఉపదేశాలకు చెందిన సంస్థాగత ఏర్పాట్లు ఏవీ చెయ్యలేదు. ప్రత్యేకించి తన శిష్యులు అని చెప్పుకొనే వ్యవస్థ కూడా ఏమీ లేదు. ఆయన అందరికీ చెందినవారు. సకోరీకి చెందిన ఉపాసనీ మహారాజ్, అహమ్మద్ నగర్‌కు చెందిన మెహర్ బాబా వంటి సాయిబాబా భక్తులు ప్రసిద్ధులయ్యారు.

శ్రీ సాయిబాబా జీవిత సమయంలో కొందరు భక్తులు ఆయనను సదా అంటిపెట్టుకొని ఉన్నారు **వారిలో ముఖ్యులు:** మహాల్సాపతి, హేమాండ్ పంతు, శ్యామా ,తాత్యా.

**బోధనలు**

మసీదు గొడకానుకొని ఉన్న సాయిబాబా, భక్తులతోడుగా తన దైనిక వ్యవహారాలలోను, బోధనలలోను సాయిబాబా హిందూమతానికి చెందిన సంప్రదాయాలనూ, ఇస్లాం సంప్రదాయాలనూ కూడా పాటించారు. నమాజ్ చదవడం, అల్-ఫతీహా మననం, ఖొరాన్ అధ్యయనం వంటి ఆచారాలను ప్రోత్సహించారు కాని చాలా ఇతర ఆచారాలను పాటించలేదు. ఆయన దుస్తులు కూడా సూఫీ ఫకీర్ తరహాలోనే ఉండేవి. మతం, కులం వంటి భేదాలపై ఆధారపడిన విద్వేషాలను పూర్తిగా వ్యతిరేకించారు. అలాగే సనాతన ఛాందస సంప్రదాయాలను, ఏ మతానివైనా గాని, ఖండించారు. తాను ఫకీరుగా ఉన్నా తన అనుయాయులను సామాన్య గృహస్థ జీవనం గడపమని చెప్పారు. ప్రార్థన, భగవన్నామస్మరణ, పుణ్యగ్రంథ పఠనం-వీటిని ప్రోత్సహించారు. ఖొరాన్ చదువమని ముస్లిములకూ, రామాయణం, భగవద్గీత, విష్ణు సహస్రనామ స్తోత్రం వంటివి పారాయణం చేయమని హిందువులకూ ఉపదేశించారు. నీతి బద్ధమైన జీవనం గడపమనీ, ఇతరులను ప్రేమించి సహాయం చేయమనీ చెప్పారు. తన భక్తులకు రెండు ముఖ్యమైన లక్షణాలు అలవరచుకోమని పదేపదే చెప్పారు - అవి శ్రద్ధ (విశ్వాసం, భక్తి, దీక్ష), సబూరి (ఓర్పు, సాధన). నాస్తికత్వాన్ని తప్పు పట్టారు. అశ్రద్ధ చేయకుండా బాధ్యతలు నెరవేర్చాలనీ, వ్యామోహానికి లొంగకుండా తృప్తులు కావాలనీ ఉపదేశించారు. రెండు మతాల గ్రంథాలనూ సాయిబాబా ఆదరించి వ్యాఖ్యానించారు. వాటిపై ఆయనకు లోతైన పరిజ్ఞానం ఉందని ఆయనతో ఉన్నవారు చెప్పారు. హిందూ మత విషయాలపై బాబా వ్యాఖ్యానాలలో అద్వైతం, భక్తి అంశాలు కలగలిసి ఉండేవి. తన నివాస స్థానమైన మసీదుకు ద్వారకామాయి అని పేరు పెట్టుకున్నారు. భగవంతుడు అంతటా, అందరిలోనూ ఉన్నాడ నేది బాబా బోధనలలో ఒక ముఖ్యాంశం. సాయిబాబా ఉపదేశాలు ఇస్లామిక్ సిద్ధాంతాలకూ, ఉపనిషత్సూత్రాలకూ కూడా సరిపోతాయి. ఈ లోకం నశ్వరమనీ, భగవంతుడిచ్చే మోక్షమే శాశ్వతమనీ చెప్పారు. సాధనలో గురువు ప్రాముఖ్య తను గురించీ, గురువునే దేవుడిగా భావించమనీ పదేపదే చెప్పారు. పూర్వపు కర్మల కారణంగా వివిధ ఫలితాలు సంభవిస్తాయని కూడా చెప్పారు. సాయిబాబా రచించిన గ్రంధాలేవీ లేవు. సాయిబాబా బోధనలు మౌఖికంగానే శిష్యులకు లభించాయి. అవి పెద్ద పెద్ద ఉపన్యాసాలు కావు. సమయానుసారంగా చేసిన చిన్న చిన్న ఉపదేశాలు. తన వద్దకు దర్శనానికి వచ్చిన వారిని తరచు సాయిబాబా దక్షిణ అడుగుతుండేవాడు. అలా వచ్చిన ధనాన్ని పేదలకు పంచిపెట్టేవారు. మిగిలిన కొద్దిపాటి ధనంతో పుగాకు, -- సశేషం --

# విత్తన లోగుట్టుపై ఆరాతీసేందుకు

## గోపీకృష్ణ సీడ్స్‌లో అధికారుల ప్రయత్నాలు



భూత్పూర్ : అనుమతిలేని పత్తి విత్తనాల ఉత్పత్తి, అమ్మకాల కేసులో పూర్తి వివరాలు రాబట్టేందుకు రాచకొండ కమిషనరేట్ పోలీసులు, వ్యవసాయ కమిషనరేట్ అధికారులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. గోపీకృష్ణ, సృష్టిసీడ్స్ విత్తన కంపెనీల పత్తి విత్తనాలు రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం తొర్రూర్, మాడ్గులలో పట్టుబడటం వీటన్నింటికి భూత్పూర్‌తో సంబంధాలు ఉండటంతో అధికారులు లోగుట్టు తెలుసుకునే పనిలో పడ్డారు. ఈ నెల 27న స్థానిక గోపీకృష్ణ కంపెనీలో సోదాలు జరిపి 1129 పాకెట్లు, విత్తన నిల్వలు జప్తు చేసిన అధికారులు కంపెనీ యాజమాన్యంపై కేసులు నమోదు చేశారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో కేసులు నమోదు కావడంతో యజమాని జానకిరాములును 28న అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. విచారణలో భాగంగా రాచకొండ కమిషనరేట్ పోలీసులు, వ్యవసాయ కమిషనరేట అధికారులు ఉమ్మడి కార్యాచరణ అమలు చేస్తున్నారు. కంపెనీ యజమాని జానకిరాములును నేరుగా కంపెనీ వద్దకు తీసుకొచ్చి విత్తన ఉత్పత్తి, అమ్మకాలు, అనుమతుల వివరాలు సేకరించారు. కంపెనీ ఎంత కాలంగా కొనసాగుతోంది ? ఎక్కడి నుంచి విత్తనాలు సేకరించారు ? ఎన్ని ప్యాకెట్లు ఎగుమతికి అనుమతి ఉంది ? ఎంత ఎగుమతి చేశారు ఎక్కడికి తరలించారనే వివరాలు సేకరించారు. కంపెనీలోని గోదాములు, గదులను క్షుణ్ణంగా పరిశీలించి మరిన్ని దస్త్రాలు, రశీదు పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. అమిస్తాపూర్‌లోని ఫౌండేషన్ ప్లాంటును సందర్శించి ఆరా తీశారు. తనిఖీల్లో వ్యవసాయ కమిషనరేట్ డీడీఏ కుమారస్వామి, ఏడీఏలు రాజారత్నం, సుజాత, జిల్లా డీడీఏ హుక్యానాయక్, హయత్‌నగర్ ఎస్ఐ ప్రభాకర్, భూత్పూర్ ఎస్ఐ అన్వర్‌హుస్సేన్ ఉన్నారు.

బోల్‌గార్డ్-3 విత్తన ఉత్పత్తిపై వ్యవసాయ కమిషనరేట్ అధికారులుచ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. భూత్పూర్, జడ్చర్ల కేంద్రాలుగా బీజీ-3 బీటీ విత్తనాలు ఉత్పత్తి అవుతున్నట్లు సమాచారం ఉందని, గోపీకృష్ణ, సృష్టిసీడ్స్ కంపెనీల నుంచి కూడా బీజీ-3 విత్తనాలు ఉత్పత్తి చేశారా అనే కోణంలో వివరాలు సేకరించారు. కంపెనీలోని గోదాములో నిల్వ ఉన్న విత్తనాలు, ప్యాకింగ్ యంత్రాలు, రసాయనాల వాడకంపై ఆరా తీశారు.

విచారణ నిమిత్తం గోపీకృష్ణసీడ్స్ కంపెనీకి చేరుకున్న అధికారులకు అనుకోని సంఘటన ఎదురైంది. కంపెనీకి సంబంధించి తాళాలు లేకపోవడంతో కమిషనరేట్ పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు ముళ్లపొదల నుంచి కంచె తొలగించి ఇతర మార్గంలో కంపెనీలోకి ప్రవేశించారు. తనిఖీలకు సైతం తాళాల సమస్య ఉండటంతో ఎక్కడికక్కడ తాళాలు విరగొట్టి దర్యాప్తు సాగించారు. విచారణ అనంతరం గదులు, కంపెనీలకు కొత్తతాళాలు బిగించారు. విచారణలో భాగంగా కమిషనరేట్ పోలీసులు కంపెనీలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు సిబ్బందిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే కంపెనీ యాజమాని అరెస్ట్ కాగా, అకౌంటెంట్ శ్రీనివాస్‌రెడ్డి వారి అదుపులోనే ఉన్నారు. తనిఖీల సందర్భంగా విచారణ కోసం కంపెనీ సిబ్బంది, డీలర్ అహ్మద్, ప్రవీణ్, చంటి ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని హయత్‌నగర్‌కు తరలించారు. అనుమతిలేని విత్తన అమ్మకాలు, ఉత్పత్తిపై నమోదైన కేసుకు సంబంధించి విచారణ చేపడుతున్నాం. విచారణలో భాగంగానే వ్యవసాయ అధికారులతో కలిసి గోపీకృష్ణ ప్లాంటును సందర్శించాం. పూర్తి వివరాలు సేకరించేంతవరకు దర్యాప్తు కొనసాగుతుందని అధికారులు చెప్పారు.

# కామాంధులపై కఠిన చర్యలు తీసుకోవాలి

## అఖిలపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన



ఖమ్మం : విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన నలుగురు కామాంధులపై నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళా చట్టాలను పటిష్ట పరచాలని ఐద్వా నాయకురాలు, కార్పొరేటర్ అఫ్రోజ్ సమీనా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామాంధులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థిసంఘాలు ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, టీఎన్ఎస్ఎఫ్, ఐద్వా, ఎన్‌డబ్ల్యూఎఫ్ఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మహిళా కళాశాల నుంచి తహశీల్దారు కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకల పేరుతో పిలిచి అత్యాచారానికి పాల్పడిన వారిని శిక్షించాలన్నారు. కళాశాల యాజమాన్యం పర్యవేక్షణ లోపం కూడా ఈ ఘటనకు కారణమని ఆరోపించారు.

మారుతున్న టెక్నాలజీ నేపథ్యంలో యువత చెడుమార్గం పట్టకుండా ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు టి. నాగరాజు, రంజిత్ కుమార్, సురేష్, లత, కర్ణకుమార్, భవాని, రమ్య, సాగర్, ఉమామహేష్, వరప్రసాద్, శ్రీకాంత్, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# భూకబ్జాలపై దుర్గంధంతో నిరసన

బెంగళూరు : భూకబ్జాదారులతో కుమ్మక్కవుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకుని, ఆక్రమణలు జరగకుండా చర్య తీసుకోవాలని గత అయిదేళ్ల నుంచి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించలేదు. భూఆక్రమణల్ని ప్రశ్నించినందుకు కేసులు బనాయించారు. పోరాటాలు చేసినా ప్రయోజనం లేకపోయింది. అవినీతిపరులే రాజ్యమేలుతున్నారు.

ఇక లాభం లేదని భావించి ఇక్కడ విధానసౌధ ముందు రాష్ట్ర బడవర హితరక్షణ వేదిక కార్యకర్తలు ధర్నాకు దిగారు. తమ వెంట తెచ్చుకున్న మలమూత్రాల్ని ఒంటిపై పోసుకుని నిరసన తెలిపారు. ఈ హఠాత్ పరిణామానికి భద్రత సిబ్బంది బిత్తరపోయారు. ఒంటిపై మల మూత్రాలు పోసుకోకుండా అడ్డుకో బోయారు. దుర్వాసనకు పోలీసులు దగ్గరకు రాలేదు. అయినా పైఅధికారుల ఒత్తిడి మేరకు కాని స్టేబుళ్లు వారిని ఈడ్చుకుని వచ్చి పోలీసు వాహనాన్ని ఎక్కించారు. విధానసౌధలోని మరుగుదొడ్డిలోకి తీసుకెళ్లి వారిని శుభ్రపరిచారు. ఈ సందర్భంగా వేదిక అధ్యక్షుడు ఎం.అణ్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని గత అయిదేళ్ల నుంచి పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. బెంగళూరు తూర్పు తాలూకా తాహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు కలిసి భూకబ్జాదారులతో చేతులు కలిపి ప్రభుత్వ భూములు ధారాదత్తం చేశారని ఆరోపించారు. వైట్‌ఫీల్డ్ సర్వే సంఖ్య 2.1సీ, 2.1డీ చెందిన 1.20 ఎకరాలు, పట్టందూరు, రామగుండన హళ్లి, హగదూరు, మారతహళ్లి, సాదరమంగల, బొమ్మసంద్ర తదితర ప్రాంతాల్లో ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూముల్ని ప్రైవేట్ నిర్మాణ సంస్థలకు కట్టబెట్టారని ఆరోపించారు. స్వాధీనం చేసుకున్న 20 ఎకరాల్ని మళ్లీ ప్రైవేట్ నిర్మాణ సంస్థకు అధికారులు అప్పగించారని విమర్శించారు. భూకబ్జాదారులతో చేతులు కలిపిన అధికారులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పోరు ఇంతటితో ఆగదని హెచ్చరించారు.

# రెండోరోజుకు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల రిలే దీక్షలు

మెట్టుగడ్డ : బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు వెంటనే వేతన సవరణ చేపట్టాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బీఎస్ఎన్ఎల్ జిల్లా అధ్యక్షుడు రాజారత్నం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలు తీర్చాలన్న డిమాండ్‌తో మహబూబ్‌నగర్‌లోని జీఎం కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు చేరాయి. ఈ సందర్భంగా రాజారత్నం మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ విధానాలతో సంస్థ ఉద్యోగులు నష్టపోతున్నారని అన్నారు. ఏదో సాకులు చెబుతూ ఉద్యోగులకు నష్టం కలిగిస్తే సామూహిక పోరాటాలు చేస్తామన్నారు. సాధ్యమైనంత త్వరలో వేతన సవరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆంజనేయులు, సత్యనారాయణ, శ్రీనివాసులు, ఎస్.రాములు గోపాల్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల దీక్షలు

నిజామాబాద్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు చేపట్టిన రెండు రోజుల రిలే దీక్షలు ముగిశాయి. జాతీయ స్థాయి ఎన్ఎఫ్‌టీఈ పిలుపు మేరకు రెండు రోజుల పాటు ఈ దీక్షలు నిర్వహించినట్లు యూనియన్ నాయకులు తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యహరిస్తే వూరుకునేది లేదన్నారు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు మూడో వేతన సవరణ అమలు చేసే విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యహరిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే మూడో వేతన సవరణను అమలు చేయాలని డిమాండు చేఅఆరు. ఇక అఫొర్టబిలిటీ అనే షరతను బీఎస్ఎన్ఎల్‌కు మినహాయించాలన్నారు.

రిలే నిరహార దీక్షలకు బీఎస్ఎన్ఎల్ ఎగ్జిక్యూటీవ్ అసోసియేషన్, ఇతర యూనియన్ నాయకులు, బీఎస్ఎన్ఎల్ ఐకాస నాయకులు పాల్గొని సంఘీభావం తలిపారు. రెండో రోజు దీక్షలో యూనియన్ నాయకులు వెంకటిగౌడ్, కే.సీఎస్. రెడ్డి, మస్తాన్‌అలీ, గంగాధర్, నర్సింలు, చంద్రశేఖర్, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్, అరవింద్ కుమార్, రామకృష్ణారెడ్డి, నారాయణ, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై ఉద్యమించాలి

పానగల్ : తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని కార్యకర్తలకు సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి పిలుపునిచ్చారు. నల్గొండలో దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయటంలో తెరాస సర్కారు విఫలమవుతోందని ఆరోపించారు. ప్రజల సమస్యలపై ప్రతిపక్షాలు నిలదీస్తుంటే అసహనం కోల్పోయిన అధికార పక్షం అవతలి వాళ్లపై బురదజల్లుతుందని విమర్శించారు. సాగు, తాగు నీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదన్నారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి లబ్ధిపొందటానికి భాజపా యత్నిస్తోందన్నారు. జీఎస్టీ అమలుతో అన్ని వర్గాల ప్రజలపై భారం పడుతుందని చెప్పారు. పెన్నా అనంతరామశర్మ, నారీ అయిలయ్య, బండ శ్రీశైలం, మల్లు నాగార్జునరెడ్డి, చిన్నపాక లక్ష్మీనారాయణ, సయ్యద్‌హాషం, వి.నారాయణరెడ్డి, పాలడుగు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.


# ముగిసిన రాష్ట్రసాయి బ్యాడ్మింటన్ పోటీలు

మెదక్ : మెదక్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-19 బ్యాడ్మింటన్ పోటీల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల క్రీడాకారులు సత్తాచాటారు. పట్టణంలోని పీఎన్ఆర్ ఇండోర్ స్టేడియంలో బాల, బాలికల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 200 మంది వరకు క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. ఆయా విభాగాల్లో తుదిపోటీలు జరిగాయి. బాలుర సింగిల్స్‌లో సాయంబోత్ర(హైదరాబాద్) విజేతగా నిలవగా, లోహిత్(రంగారెడ్డి) రన్నర్‌గా నిలిచారు. బాలికల సింగిల్స్‌లో విజేతగా మేఘనారెడ్డి(హైదరాబాద్), రన్నర్‌గా శ్రీవిద్య(మెదక్), బాలుర డబుల్స్‌లో అకాశ్‌చంద్రన్, సాయిరోహిత్(హైదరాబాద్) విజేతలుగా, నవనీత్, సిద్దార్థ్ ఎలంగో(మెదక్) రన్నర్‌గా, బాలికల డబుల్స్‌లో సుప్రియ, వన్షిక(హైదరాబాద్), భార్గవి, పూర్విసింగ్(రంగారెడ్డి) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రశాంత్(ఖమ్మం), సుప్రియ(రంగారెడ్డి), దానిక్, భార్గవిలపై గెలుపొందారు. పాలనాధికారి భారతి శికెరి, మెదక్ పురపాలిక అధ్యక్షులు మల్లికార్జున్‌గౌడ్ విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపికలను అందజేశారు.

# శ్రీవేంకటేశ్వరస్వామికి లక్ష పుష్పార్చన


రామన్నపేట : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ బట్టలబజారులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి లక్ష మల్లెలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్య, అర్చకులు నర్సింహాచార్యులు, శేషాచార్యులు, శ్రీధరాచార్యులు, వెంకటాచార్యుల ఆధ్వర్యంలో 108 లీటర్ల గోక్షీరంతో స్వామివారికి అభిషేకం జరిపించారు.

# భైరవకోన - అద్భుత గుహాలయాలు !



ఆంధ్రప్రదేశ్ లో నల్లమల అటవీ ప్రాంతంలో శివాలయాలకు కొదువలేదు. ఆ శివాలయం చిన్నదైనా, పెద్దదైనా అక్కడికి వెళ్లిరావటానికి భక్తులు పరవశించిపోతుంటారు. అలాంటి శివాలయాలలో ఒకటి భైరవకోన లో కలదు. శివాలయమే కాదు, పార్వతీదేవి ఆలయం, దేవీదేవతల శిలారూపాలు, గ్రానైట్ శిలలతో చెక్కబడ్డ శివలింగాలు, ఆకాశగంగ ను తలపించేలా జలపాతం, చుట్టూ ఆహ్లాదకరమైన ప్రక ృతి ఇవన్నీ కూడా యాత్రికులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఎక్కడ ఉంది ? భైరవకోన, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం -ప్రకాశం జిల్లా - చంద్రశేఖరపురం మండలంలోని కొత్తపల్లి గ్రామం సమీపాన కలదు. కొత్తపల్లి గ్రామం నుండి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో భైరవకోన క్షేత్రం కలదు.

ఎలా వెళ్ళాలి? ప్రకాశం నుండి ప్రతిరోజూ నిర్దిష్ట సమయంలో 'భైరవకోన' కు ప్రభుత్వ బస్సులు తిరుగుతుంటాయి. ప్రకాశం నుండి భైరవకోన కోన 70 కిలోమీటర్ల దూరంలో కలదు. కొత్తపల్లి, అంబవరం గ్రామాల నుండి కూడా భైరవకోన కు ప్రభుత్వ బస్సులు, ప్రవేట్ జీపులు, ఆటోలు దొరుకుతాయి. ప్రకాశం జిల్లా గిద్దలూరు సమీపంలో గల నెమలిగుండం చూసొద్దామా ! శివాలయం భైరవకోన లో ప్రసిద్ధిగాంచిన శివాలయం కలదు. దేనిని క్రీ.శ. 9 వ శతాబ్దంలో నిర్మించారు. పల్లవ రాజుల అదుతే శిల్పకళకు నెలవు ఈ భైరవకోన. కొండల్ని తొలచి గుహాలయాలుగా నిర్మించడం అన్నది అప్పట్లో ఒక గొప్ప అదుతే కళ. గుహల గోడలపై చెక్కిన శిల్పాలు పల్లవుల శిల్పకళ ను గోచరిస్తుంది. స్థలపురాణం ప్రకారం, క ృతయుగం నృసింహాలయంలో ప్రహ్లాదుడు నియమించిన అర్చకుడు భైరవుడు. ప్రహ్లాదుడు చనిపోయాక ఈ గుడిని పట్టించుకొనే నాధుడు లేక పొట్టకూటి కోసం భైరవుడు దారిదోపిడీలకు పాల్పడేవాడు. అందుకు ఆగ్రహించిన న ృసింహస్వామి రాక్షసుడు అవ్వమని, తనకంటికి కనిపించకుండా భక్తులు తెచ్చినది ఏదైనా తన ప్రసాదంగా స్వీకరించమని, కలియుగానంతరం మరలా తనను సేవించవచ్చని చెబుతాడు. నాటి నుండి నేటివరకుభైరవుడు భైరవకోన లో పూజలు అందుకుంటు న్నాడు.



### శ్రీ దుర్గా భైరవేశ్వర స్వామి దేవాలయం

చిత్రకృప : ఎనిమిది శివాలయాలు నల్లమల అభయారణ్యంలో ఎక్కడ చూసిన దేవీదేవతలు శిల్పాలే దర్శనమిస్తుంటాయి. ఓ కొండ రాతిని తొలిచి అందులో ఎనిమిది శివాలయాలను చెక్కిన వైనం ఎంతో అపురూపంగా అనిపిస్తుంది. వీటన్నింటినీ ఒకేసారి దర్శించుకోవచ్చు. అన్ని ఆలయాల్లో గరేగుడి, వరండాలు, స్తంభాలు అన్నీ కూడా కొండ రాయితోనే మలచడం విశేషం. శివలింగాలను మాత్రేమే గ్రానైట్ రాయితో చెక్కి ప్రతిష్టించారు. దక్షిణ పూరీ క్షేత్రం - వడాలి, కృషా? జిల్లా ! ఒకేచోట ముగ్గురుమూర్తులు ఎనిమిది గుహలలో ఒకటి ఉత్తరముఖంగా (మొదటిది), మిగిలిన ఏడు గుహలు తూర్పుముఖంగా ఉంటాయి. మొదటిగుహ : తలపాగా ధరించిన ద్వారపాలకులు ఈ గుహ ప్రధాన ఆకర్షణ. ఉత్తరముఖంగా ఉంటుంది. గరేగుడికి ఎదురుగా నంది విగ్రహం ఉంటుంది. అఖండజ్యోతి దర్శనానికి వెళ్ళే మెట్లు, అఖండ జ్యోతి ఉన్న గుహ రెండవ గుహ - ఏడవ గుహ : రెండవ గుహ మొదలు ఏడవ గుహ వరకు ఆలయాలన్నీ తూర్పు ముఖంగానే ఉంటాయి. గరేగుడి అన్నింటిలో గ్రానైట్ తో చెక్కబడిన శివలింగాలను ప్రతిష్టించారు. ఎనిమిదో గుహ : ఎనిమిదో గుహ ప్రత్యేకమైనది. లింగంతో పాటు బ్రహ్మ, విషు? బొమ్మలను చెక్కి ఉండటం విశేషం. అమ్మవారిగుడి : భైరవకోన క్షేత్రంలో అమ్మవారి గుడి నూతనంగా నిర్మించారు. ఈ ఆలయంలో ప్రతిష్టించిన విగ్రహం మాత్రం పురాతనమైనది. ఈ గుడి అడవిలో ఉన్నందున ప్రతిరోజూ కాకుండా, శుక్రవారం అర్చిస్తారు. పండుగలు, పర్వదినాలలో ఉత్సవాలు నిర్వహిస్తారు.



భైరవకోన జలపాతం

జలపాతం భైరవకోన లో కొండల మధ్య నుంచి దూకే జలపాతం యాత్రికులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఈ జలపాతం కింద పిల్లలు, పెద్దలు తడుస్తూ ఆనందించవచ్చు. నింగిని తాకేలా వ ృక్షాలు, పక్షులకిలకిలారావాలు, ఆహ్లాదభరితవాతావరణం తప్పక ఉత్సాహాన్ని కలిగిస్తాయి.

ఏపీలోని ఈ శివాలయాలను మీరెప్పుడైనా విన్నారా ? పౌర?మి అందాలు ప్రతి సంవత్సరం కార్తీకపౌర్ణమి రోజున చంద్రబింబం, అక్కడి ఆలయాలనికి మూడు అడుగుల కింద ప్రవహించే సెలయేటిలో పడి, దుర్గాదేవి విగ్రహం పై పడుతుంది. ఈ అదుతే దృశ్యాన్ని తిలకించేందుకు భక్తులు ఆ రోజున అధికంగా తరలివస్తుంటారు.

# కొవ్వు కరిగించే జీలకర్ర



ప్రతీరోజూ మనం వండుకునే పప్పు లేదా ఇతర కాయగూర వంటల్లో జీలకర్రను కలుపుతాం. కేవలం ఫ్లేవర్ కోసమే దీనిని కలుపుతారని చాలా మంది అనుకుంటారు. కాని దీని వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలిస్తే ఆశ్చర్యం కలగడం ఖాయం. ముఖ్యంగా బరువు తగ్గించడంలో జీలకర్ర గణనీయమైన పాత్ర పోషిస్తుందట. శరీరంలో కొవ్వు శాతాన్ని తగ్గించి, చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించ గల సత్తా జీలకర్రకు ఉందట. జీలకర్రలో థైమోల్ అనే రసాయనంతోపాటు ఉండే కొన్ని ముఖ్యమైన ఆయిల్స్ శరీరంలో ఉండే కొవ్వును తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తాయట. అలాగే జీర్ణప్రక్రియను సులభతరం చేస్తాయట.

ఒక గ్లాస్ నీటికి ఒక టీ స్పూన్ జీలకర్ర కలిపి వేడి చేయాలి. ఆ నీరు బ్రౌన్ కలర్‌లోకి మారిన తర్వాత దాన్ని తిరిగి చల్లబర్చి తాగాలి. ఇలా రోజుకు మూడు సార్లు తాగితే డైజెషన్ సులభంగా అవుతుంది. అంతేకాకుండా బరువు తగ్గడం కూడా సులభమవుతుంది.

ఉదయాన్నే తాగే కాఫీలో ఓ స్పూను బట్టర్ (వెన్న)కలుపుకుని తాగితే బరువు తగ్గడానికి అవకాశం ఉంది అంటున్నారు పరిశోధకులు. వెన్న తింటే లావెక్కుతారు కదా? అన్న అనుమానాన్ని వారు కొట్టిపారేస్తున్నారు. కాఫీలో వెన్న కలుపుకుని తాగడం వల్ల ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉంటుందనీ, కనీసం మరోసారి కాఫీ తాగాలనే కోరిక కూడా కలగదనీ వారు చెబుతున్నారు. దీని వల్ల అదనపు క్యాలరీల బెడద తగ్గుతుందని కూడా వారు స్పష్టం చేస్తున్నారు.

# బరువు తగ్గించే బట్టర్ కాఫీ



ఇదే విషయంపై కొంత మంది ఊబకాయుల మీద వారు పరిశోధనలు నిర్వహించారు. సుమారు వంద మందిని రెండు గ్రూపులుగా విభజించి ఒక గ్రూపు వారికి వెన్న కలిపిన కాఫీని, మరొకరికి మామూలు కాఫీని ఇచ్చారు. కొన్ని నెలల అనంతరం రెండు గ్రూపుల బరువును పరిశీలించగా వెన్నకాఫీ తాగిన వారి బరువులో స్వల్ప మార్పు కనిపించగా, మామూలు కాఫీ తాగిన వారు కొద్దిగా బరువు పెరగడాన్ని వారు గుర్తించారు. వెన్న కాఫీ తాగిన వారిలో ఆహారం తీసుకోవాలన్న కోరిక కలగకపోవడం, గతం కన్నా వారి మెదడు చురుకుగా పనిచేయడాన్ని వారు కనుగొన్నారు. వెన్న కాఫీలో చక్కెరకు బదులుగా వెన్న కలుపుకోవాలనీ, అది కూడా వెన్న కలిపిన వెంటనే కాఫీ తాగేయాలనీ, నెయ్యి పైకి తేలేంత వరకూ ఆగకూడదనీ వారు సూచిస్తున్నారు.

# హాయిగా నిదురపో...

నిద్ర మనలోని చికాకులన్నింటినీ తరిమేసే అద్భుత ఔషధం. కానీ కొందరు నిద్రలేమితో సతమతమవుతుంటారు. సాధారణంగా ప్రతీవ్యక్తికీ ఆరునుండి ఎనిమిది గంటల నిద్ర అవసరం. అయితే స్త్రీలకు మరోగంట అదనంగా నిద్ర అవసరం. ఇది పరిశోధనల్లో తేలిన అంశం. ఆడవారికి శ్రమతో పాటు ఆందోళనా అధికంగానే ఉంటుంది. కాబట్టి కాస్త ఎక్కువ నిద్రే అవసరం. వీరు నిద్రపోయే సమయంలో కనీసం పదిహేను నిమిషాలు తగ్గినా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కోవాల్సివస్తుంది. అదే గంటల తరబడి నిద్రని వాయిదా వేస్తూ పోతే ఒత్తిడి ఎక్కువవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

నిద్రలేమితో బాధపడేవారు కొన్ని చిట్కాలను పాటిస్తే నిద్రరాకపోవడమన్న సమస్య ఉండదు. నిద్రలేమి వల్ల ఊబకాయం వచ్చే అవకాశాలు ఉంటాయి. పడుకునే సమయంలో కాఫీ, టీ సేవించ కూడదు. ఒకసారి టీ తాగితే దాని ప్రభావం మూడు గంటల వరకు ఉంటుంది. వాటిలో ఉండే కొన్ని రకాల పదార్థాలు సరైన నిద్రకు భంగం కలిగిస్తాయి.

మధ్యాహ్నం నిద్రపోవడం మానివేయాలి. ఈ నిద్ర రాత్రిపూట నిద్రని దెబ్బతీస్తుంది.

ప్రతిరోజు క్రమం తప్పకుండా కొన్ని ఆరోగ్యసూత్రాలను పాటిస్తే సక్రమమైన నిద్ర ఉంటుంది.ముఖ్యంగా ఎక్సర్‌సైజ్ చేయడం, క్రమం తప్పకుండా యోగా చేస్తే శరీరం ఫిట్‌గా ఉండటమే కాకుండా సుఖంగా నిద్రపోవడానికి కూడా సహాయం చేస్తుంది.

భోజనం చేసిన వెంటనే నిద్రపోవడం సరైన పద్ధతి కాదు. దానివల్ల తిన్న ఆహారం జీర్ణం కాకపోవడం, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తుతాయి. కనుక భోజనం చేసిన తర్వాత కొంతసమయం నడవడం వంటివి చేస్తే ఆరోగ్యానికి మంచిది.

భోజనవేళలను సరిగా పాటించాలి. లేకపోతే దీనివల్ల ఆజీర్ణం వంటి సమస్యలు తలెత్తి నిద్రమీద దాని ప్రభావం చూపుతుంది. అందుకే సమయానుకూలంగా భోజనం చేయడం ద్వారా నిద్రలేమిని కొంత వరకు అరికట్టవచ్చు.


ఆడవారు ఇంటి పనులు చేసి ఎక్కువగా అలసిపోతుంటారు. ఇటువంటి వారు బలవర్ధకమైన ఆహారం తీసు కోవాలి.దానివల్ల వారికి మంచి నిద్ర పడుతుంది.




## ఏయే సమయాల్లో మన శరీరంలో ఏమేం జరుగుతుందో తెలుసా...?!!


మనం అనేక రకాల పనులను నిత్యం టైం ప్రకారం చేస్తుంటాం. అయితే మనం ఏ పని చేసినా దానికి ఒక టైమంటూ ఉంటుంది. కానీ మన శరీరం కూడా ఒక నిర్దిష్టమైన సమయాన్ని పాటిస్తుందని మీకు తెలుసా? అవును, మీరు విన్నది నిజమే. మన శరీరం కూడా తనలో జరిగే జీవక్రియలకు ఒక్కో సమయాన్ని కేటాయిస్తుంది. ఆ సమయంలో ఆయా అవయవాలు యాక్టివ్‌గా పనిచేస్తాయి. దీనివల్ల మనం ఆరోగ్యంగా ఉంటాము. అయితే మన శరీర అవయవాలు యాక్టివ్‌గా ఉన్న సమయంలో వాటికి విరుద్ధంగా మనం చేసే కొన్ని పనుల వల్ల ఆయా భాగాలపై ఒత్తిడి పెరిగి మనకు అనారోగ్యం కలుగుతుంది.

- ఉదయం 5 నుంచి 7 గంటల మధ్య సమయంలో పెద్ద పేగు యాక్టివ్‌గా ఉంటుంది. శరీరంలోని వ్యర్థాలను బయటకి పంపే పనిలో అది మునిగి ఉంటుంది. కాబట్టి ఈ సమయంలో మనం ఎంత వీలైతే అంత ఎక్కువగా నీటిని తాగాలి. వాకింగ్, రన్నింగ్ వంటి వ్యాయామాలు చేయాలి. కాఫీ, టీ వంటివి అస్సలు తాగకూడదు.
- ఉదయం 7 నుంచి 9 మధ్య ప్రోటీన్లు, తక్కువ పిండి పదార్థాలు కలిగిన ఆహారం, ఆరోగ్యకరమైన కొవ్వులు కలిగిన ఆహారాన్ని, పండ్లను ఈ సమయంలో బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకోవాలి. దీనివల్ల మన శరీరానికి కావల్సిన పోషకాలు ఎక్కువగా ఉదయమే అందుతాయి.
- ఉదయం 9 నుంచి 11 మధ్య సమయంలో మన శరీరంలోని ప్లీహం ఉత్తేజంగా ఉంటుంది. అది మన శరరీంలో జరిగే జీవక్రియలను గాడిలో పెడుతుంది. ఉదయం మనం తిన్న ఆహారం నుంచి పోషకాలను శరీరం గ్రహించేలా చేస్తుంది.
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య సమయంలో మన గుండె ఉత్తేజంగా పనిచేస్తుంది. శరీర భాగాలకు రక్తం బాగా సరఫరా అయ్యేలా చూస్తుంది. దీని వల్ల శరీర కణాలకు శక్తి అందుతుంది.
- మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల సమయంలో చిన్నపేగులు అలర్ట్‌గా ఉండి బాగా పనిచేస్తాయి. మనం తిన్న బ్రేక్‌ఫాస్ట్, లంచ్‌ల జీర?ప్రక్రియను ముగిస్తుంటాయి.
- మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల సమయంలో మన మూత్రాశయం యాక్టివ్‌గా పనిచేస్తుంది. శరీరంలోని వ్యర్థాలను బయటకి పంపే పనిలో ఉంటుంది. ఈ సమయంలో నీరు ఎక్కువగా తాగాలి.
- సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల సమయంలో మన కిడ్నీలు బాగా చురుగ్గా పనిచేస్తాయి. రక్తాన్ని వడబోయడం, వ్యర్థాలను మూత్రాశయానికి పంపడం వంటి కార్యక్రమాలను చేస్తాయి.
- రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య సమయంలో పెరికార్డియం ఉత్తేజంగా ఉంటుంది. ఈ టైంలో రాత్రి భోజనాన్ని కచ్చితంగా ముగించాలి. మెదడు, ప్రత్యుత్పత్తి అవయవాలను పెరికార్డియం ఈ




సమయంలో యాక్టివేట్ చేస్తుంది.
- రాత్రి 9 తర్వాత నుంచి 11 గంటల మధ్య సమయంలో భోజనం అస్సలు చేయకూడదు. థైరాయిడ్, అడ్రినల్ గ్రంథులు ఇప్పుడు బాగా పనిచేస్తాయి. ఇవి శరీర మెటబాలిజం ప్రక్రియను చురుగ్గా సాగేలా చేస్తాయి. శరీర ఉషో?గ్రతను క్రమబద్ధీకరిస్తాయి. కణాలకు శక్తి అందేలా చూస్తాయి.
- రాత్రి 11 నుంచి 1 గంట మధ్య సమయంలో మూత్రాశయం యాక్టివ్‌గా ఉంటుంది. గాల్ స్టోన్స్ వంటివి ఉన్నవారికి ఈ సమయంలో సాధారణంగా నొప్పి వస్తుంటుంది.
- రాత్రి 1 నుంచి ఉదయం 3 మధ్య సమయంలో కాలేయం చురుగ్గా ఉంటుంది. అప్పుడు మేల్కొని ఉంటే లివర్ పనితనం దెబ్బతింటుంది. కాబట్టి ఈ సమయంలో ఖచ్చితంగా నిద్రపోవాల్సిందే. లేదంటే కాలేయం సరిగ్గా పనిచేయదు. వ్యర్థాలు బయటికి వెళ్లవు.
- ఉదయం 3 నుంచి 5 మధ్యలో ఊపిరితిత్తులు యాక్టివ్‌గా ఉంటాయి. ఆ సమయంలో దగ్గు వస్తుందంటే ఊపిరితిత్తులు విష పదార్థాలను బయటకు పంపుతున్నాయని అర్థం చేసుకోవాలి.

## అల్లం నీటిని తాగండి.. సులభంగా బరువు తగ్గండి..!



గోదావరీ నదికి భారీగా వరదనీరు.. పెరిగిన నీటిమట్టం.. ప్రమాద హెచ్చరికలు దానిమ్మ తొక్కతో చుండ్రుకు చెక్... పండ్ల తొక్కలతో ఆరోగ్య ప్రయోజనాలెన్నో ! యూరో కప్ ఫైనల్ : ఓడిన ఫ్రాన్స్... జీర్ణించుకోలని ఫ్యాన్స్... ఈఫిల్ టవర్ వద్ద బీభత్సం! ఉప్పునీటితో ప్రయోజనాలెన్నో... బరువు కూడా తగ్గొచ్చు! విరాట్ కోహ్లీ తాగే నీరు లీటరు ఖరీదు రూ.600.. ఆ నీటి ప్రత్యేకత ఏంటి? సులువుగా బ్రువు తగ్గానికి నానా క్టాలు ప్డుతున్నారా...అయితే మ్న రోజూ వారీ డైట్‌లో చేసుకునే చిన్న చిన్న మార్పులు మంచి ఫలితాన్నిస్తుంది. నిత్యం వంటల్లో ఉపయోగించే ఆహారపదార్థాలతోనే సులువుగా బరువు తగ్గించుకోవచ్చు. ఘాటుగా ఉండే అల్లంలో ఎన్నో రకాలైన ఔషధ గుణాలున్నాయి. ఇందులో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ వంటి ధర్మాలతోపాటు ఎన్నో రకాల విటమిన్స్, మినరల్స్, ఇతర పోషకాలు అల్లంలో ఉన్నాయి. అంతేకాదు అల్లంలో బరువు తగ్గించే, కొవ్వును కరిగించే గుణాలు కూడా ఉన్నాయని చాలామందికి తెలీదు. అల్లం నీటిని తాగితే సులభంగా బరువు తగ్గొచ్చట. పొట్ట, నడుము, తొడల వంటి భాగాల్లో అధికంగా పేరుకుపోయిన కొవ్వును సులభంగా తగ్గించే గుణం అల్లంలో పుష్కలంగా ఉందట. ఈ క్రమంలో జింజర్ వాటర్‌ను ఎలా తయారు చేసుకోయాలో తెల్సుకుందాం... అల్లాన్ని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. అనంతరం ఆ ముక్కలను నీటిలో వేసి మరిగించాలి. ఇలా 10 నిమిషాలు మరిగించి వడకట్టుకోవాలి. ఇలా రెడీ చేసుకున్న నీటిని నిత్యం తాగుతుంటే సులభంగా పేరుకుపోయిన కొవ్వు కరగడం మొదలవుతుంది. అయితే కనీసం 1 లీటరు వరకైనా జింజర్ వాటర్‌ను ప్రతిరోజు తాగాలి.

# షుగర్ ఎక్కువైతే అనర్థమే



రక్తంలో సుగర్ ఎక్కువయితే అది శరీరంలోని కణాల నుంచి నీటిని తీసుకుంటుంటుంది. దాంతో డిహైడ్రేషన్ కలుగుతుంది. అందుకే రక్తంలో సుగర్ ఎక్కువగా ఉన్నవాళ్లు డయాబెటిక్స్ దాహంతో బాధపడుతుంటారు. డయాబెటిస్ ఉన్నవాళ్లు ఆకలితో ఎందుకు అలమటిస్తుంటారంటే ఎంత తిన్నా జీర్ణమైన ఆహారం కణాలకు చేరదు కాబట్టి. వాటితోబాటు మూత్రానికి ఎక్కువసార్లు పోతున్నా, కారణం లేకుండా బరువు తగ్గిపోతున్నా, అలసట, నీరసం ఎక్కువగా ఉన్నా చూపు అలికినట్లున్నా, గాయాలై త్వరగా మానకుండా ఉన్నా, కాళ్లుచేతుల్లో తిమ్మిర్లుగా ఉంటున్నా, వయసు 30 దాటుతున్నా రక్తపరీక్షల ద్వారా డయాబెటిస్ ఉన్నది లేనిది నిర్ధారణ చేసుకోవాలి. వ్యాధి ఉంటే వైద్యుల సలహా మేరకు జాగ్రత్తపడాలి.

డయాబెటిస్‌ని అదుపులో ఉంచుకోవాలి. లేకపోతే అనర్థాలు అధికం. డయాబెటిస్ జబ్బు కాదు గానీ అన్ని జబ్బులకు మూలం, అదుపులో ఉంచు కోకపోతే. ఆర్టెరీస్ రక్తనాళాలు దెబ్బతింటాయి. ముఖ్యంగా సన్నటి రక్తనాళాలకు ముప్పు ఉంటుంది. ఈ రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయే ప్రమాదం ఎక్కువ. అలా రక్తనాళాలలో కొవ్వు పేరుకుపోవడంవల్ల హార్ట్ ఎటాక్ లేక స్ట్రోక్‌లాంటివి రావచ్చు. పెద్ద రక్తనాళాలు మూసుకుపోయే ప్రమాదం ఉంది. కాళ్లలో రక్తనాళాలు దెబ్బతిని, గాంగ్రిన్ లాంటివి కలిగే ప్రమాదాలున్నాయి. అధిక రక్తపోటు కలగవచ్చు. అదీ గుండెకి ప్రమాదమే కదా? ఆహార నియంత్రణ చాలా అవసరం. కొవ్వు పదార్థాల్ని తగ్గించివేయాలి. కడుపునిండా తినకూడదు. ఖాళీ కడుపుతో ఉండకూడదు. నాలుగు గంటలకోసారి కొద్దికొద్దిగా తీసుకోవాలి. డయాబెటిస్‌తో నరాలు దెబ్బతింటాయి. నరాల మీద ఉండే పొర దెబ్బతినడంతో న్యూరోపతి వస్తుంది. రక్తనాళాలు దెబ్బతింటే, వాస్క్యులోపతి అంటారు. పాదవాటి రక్తనాళాలు దెబ్బతిన్నట్లే, పాదవాటి నరాలు దెబ్బతింటాయి. అందుకే పాదాలను జాగ్రత్తగా చూసుకోవాలి. వారానికొకసారైనా గోరు వెచ్చని నీటిలో పాదాల్ని ఉంచి, తర్వాత శుభ్రంగా తుడవాలి. డయాబెటిస్‌వల్ల ఒక్కోసారి మూత్ర పిండాలు పూర్తిగా దెబ్బతినవచ్చు. డయాబెటిక్ వల్ల రెటినోపతి రావచ్చు. కళ్లలోని రెటీనా దెబ్బతినడంవల్ల ఇది వస్తుంది. ఇన్‌ఫెక్షన్స్ త్వరగా రావచ్చు. క్షణాల్లో వ్యాపించవచ్చు. అంగస్తంభన, నరాలు, రక్తనాళాలు దెబ్బతినడంవల్ల తగ్గి దాంపత్య జీవితం దెబ్బతింటుంది. నరాలు దెబ్బడంవల్ల నొప్పి లేకుండా గుండె నొప్పి లాంటివి వస్తాయి. అందుకే దీనిని సైలెంట్ కిల్లర్ అంటారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని డయాబెటీస్‌ని అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం.

# రింగురింగుల జుట్టుతో జాగ్రత్తసుమా!



రింగు రింగుల జుట్టు సాధారణంగా ఉండే జుట్టుకంటే పెళుసుగా ఉండటమేగాకుండా, పొటిపొడిగా ఉంటుంది.

కాబట్టి రింగుల జుట్టు ఉన్నవారు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. రింగుల జుట్టు ఉన్న వారు షాంపూతో వారానికి ఒక సారైనా తప్పకుండా తలస్నానం చేయాలి. దానివల్ల తలలో చర్మం, వెంట్రుకలు జిడ్డులేకుండా ఉంటాయి. తలస్నానానికి మాయిశ్చరైజింగ్ షాంపూ అయితే మరీ మంచిది. ఇది జుట్టు పొడిపొడిగా ఉంచేందుకు సహకరిస్తుంది. వారంలో వీలనైనన్ని సార్లు షాంపూతో తలస్నానంచేస్తే రింగుల జుట్టు జిడ్డులేకుండా ఆరోగ్యంగా ఉంటుంది. అయితే స్నానం చేసిన తరువాత రింగుల జుట్టును సహజంగానే గాలికి ఆరనివ్వాలి. అలాకాకుండా డ్రయ్యర్‌నుగనుక వాడితే జుట్టు విరిగిపోయే ప్రమాదం ఉంటుంది.

అసలే రింగు రింగులుగా ఉన్న జుట్టు మరింతగా రింగులు తిరగకుండా ఉండేందుకు యాంటిఫ్రిజ్ సిరమ్‌ను ఉపయోగించటం ఉత్తమం. ఈ సిరమ్‌ను జుట్టు కుదుళ్లనుంచీ రాస్తే సరిపోతుంది.

# చిత్రభాను

## ఎన్టీఆర్ 'బిగ్‌బాస్'కు స్టార్ గ్లామర్..





యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ తొలిసారి బుల్లితెరపై ఎంట్రీ ఇస్తూ చేస్తున్న రియాలిటీ షో బిగ్‌బాస్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. హిందీ వెర్షన్‌లో ఈ కార్యక్రమానికి బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఆ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా విశేష ఆదరణ ఉంది. ఈ కార్యక్రమానికి ప్రస్తుతం దక్షిణాదికి విస్తరిస్తున్నారు. తమిళంలో హోస్ట్‌గా విలక్షణ నటుడు కమల్ హాసన్ చేస్తుండగా, తెలుగులో ఆ అవకాశం జూనియర్ ఎన్టీఆర్‌కు వచ్చింది. అయితే ఈ కార్యక్రమంలో పాల్గొనే వారి పేర్లను తాజాగా స్టార్ మా టెలివిజన్ చానెల్ వెల్లడించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారి జాబితాలో ప్రముఖ నటుడు, రచయిత పోసాని క ృష?మురళి, సదా, స్నేహా, రంభ, మంచు లక్ష్మి తదితరుల పేర్లు ఉన్నట్టు వెల్లడించారు. ఈ తారల పేర్లు బయటకు రావడంతో బిగ్‌బాస్ తెలుగు వెర్షన్‌కు మరింత క్రేజ్ పెరిగింది. ఈ కార్యక్రమానికి హోస్ట్‌గా యంగ్ టైగర్ ఎన్టీఆర్ వ్యవహరిస్తున్నారనే వార్త బయటకు రాగానే తెలుగు టెలివిజన్ రంగానికి కొత్త క్రేజ్ వచ్చినట్టయిందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. టాలీవుడ్‌లో పోసాని క ృష?మురళిది ప్రత్యేకమైన శైలి. మాటల రచయితగా పరిశ్రమలోకి వచ్చిన పోసాని ఆ తర్వాత నటుడిగా, దర్శకుడి, నిర్మాతగా మారారు. ప్రస్తుతం టాలీవుడ్ కమెడియన్, క్యారెక్టర్ ఆరిస్ట్‌లో పాపులర్ అనే ముద్ర ఉంది. టెలివిజన్ రంగంలో జీ చానెల్లో బతుకు జట్కా బండి అనే కార్యక్రమంలో హోస్ట్‌గా ఉన్నారు. ఎన్టీఆర్ హోస్ట్‌గా ఉన్నారనే అంశంతో ఆయన బిగ్‌బాస్‌కు పోసాని ఒకే చెప్పినట్టు సమాచారం. బిగ్‌బాస్‌లో మరో పార్టిసిపెంట్ సినీ నటి సదా. దక్షిణాదిలో సక్సెస్ ఫుల్ చిత్రాల్లో కనిపించింది. ప్రస్తుతం ఈటీవీలో ఢీ అనే డ్యాన్స్ కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఆమె కుదుర్చుకొన్న నాలుగు సంవత్సరాల కాంట్రాక్టు ముగిసింది. ఈ నేపథ్యంలో బిగ్ బాస్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఒకే చెప్పినట్టు సమాచారం. తెలుగు చిత్రాల్లో హోమ్లీ హీరోయిన్‌గా రాణించిన స్నేహ కూడా బిగ్‌బాస్‌లో పాల్గొనున్నారు. ఆమె నటించిన చిత్రాలు దక్షిణాదిలో చాలా సక్సెస్‌గా నిలిచాయి. పలు భాషల్లో అగ్రహీరోల సరసన ఆమె నటించిన ఘనత ఉంది. స్నేహ పాల్గొనడం ద్వారా బిగ్‌బాస్‌కు మంచి క్రేజ్ వచ్చే అవకాశం ఉంది. బిగ్‌బాస్‌లో పాల్గొనే అగ్రతారల్లో రంభ ఒకరు కావడం మరో విశేషం. యమదొంగ చిత్రంలో జూనియర్ ఎన్టీఆర్‌తో ప్రత్యేకమైన పాటలో కూడా నర్తించింది. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్ లాంటి అగ్రహీరోల సరసన నటించి మెప్పించింది. అదుతేమైన టాలెంట్ ఉన్న సీనియర్ హీరోయిన్లలో రంభ ఒకరు. రంభ గ్లామర్ బిగ్‌బాస్‌కు అదనపు ఆకర్షణగా మారే అవకాశం ఉంది. టాలీవుడ్‌లో స్టార్ సెలబ్రిటీ స్టేటస్ ఉన్న యాక్టర్లలో మంచు లక్ష్మి ఒకరు. సినీ నటిగా, యాంకర్‌గా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులు. బిగ్‌బాస్‌లో మంచు లక్ష్మి పాల్గొనడం ప్లస్ పాయింట్ అని చెప్పవచ్చు. మంచు లక్ష్మితోపాటు గ్లామర్ ఉన్న




స్టార్లు పాల్గొనడం ద్వారా బిగ్ బాస్ ఓ రేంజ్‌లో ఉండే అవకాశం కనిపిస్తున్నది. ఎన్టీఆర్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న తెలుగు బిగ్‌బాస్ రియాలిటీ షో జూలై 15వ తేదీన ప్రారంభం కానున్నది. ఈ కార్యక్రమంలో 12 మంది సెలబ్రిటీలు పాల్గొంటారు. దాదాపు 70 రోజులు పెద్ద భవనంలో కలిసి ఉంటారు. ఈ భవనం చుట్టూ 70 కెమెరాలు అమర్చారు.







## తప్పుడు వార్తలు రాశారు: రవితేజ వాదన!



తన రక్తం పంచుకుపుట్టిన తమ్ముడు భరత్ రోడ్డు ప్రమాదంలో మరణిస్తే కనీసం చివరి చూపు కూడా చూడలేదు, అంత్య క్రియలకు హాజరు కాలేదు. ఆసుపత్రి నుండి నేరుగా స్మశానానికే మ ృతదేహాన్ని తరలించి అనాద శవంలా దహనం చేవారు. తలకొరివి కూడా ఎవరో క్యారెక్టర్ ఆర్టిస్టుతో పెట్టించారు....అనే. విమర్శలపై రవితేజ స్పందించారు. బుధవారం భరత్ పెద్దకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవితేజను మీడియా వారు ప్రశ్నించారు. మీడియా ప్రశ్నలతో రవితేజ కాస్త ఇబ్బంది పడ్డాడు. ఎవరో బయటి వ్యక్తి, క్యారెక్టర్ ఆర్టిస్టుకు రూ. 1500 ఇచ్చి తలకొరివి పెట్టించామనే వార్తల్లో నిజం లేదని, ఇది పూర్తిగా అవాస్తవమని రవితేజ స్పష్టం చేశారు. తన తమ్ముడు రఘు, బాబాయ్ అంత్యక్రియలు దగ్గరుండి చూసుకున్నారని తెలిపాడు.తమ్ముడిని ప్రాణం లేకుండా చూడటం ఇష్టం లేకనే తాను, అమ్మ, ఇతర కుటుంబ సభ్యులమెవరూ రాలేదని, తమ మదిలో అతడి ఇమేజ్ ఎప్పుడూ హ్యాపీగా ఉండిపోవాలనే ఇలా చేశామని రవితేజ తెలిపారు. భరత్ మరణించిన మర్నాడు షూటింగుకు హాజరు కాలేదు. ఆ తర్వాతి రోజు వెళ్లిన మాట వాస్తవమే. సినిమా అంటే ఓ పాతిక మంది ఆర్టిస్టుల కాంబినేషన్లో షూటింగ్ ఉంటుంది. అది మిస్సయితే మళ్లీ ఎప్పుడో గానీ కుదరదు, షూటింగుకు ఇబ్బంది కలిగించడం ఇష్టం లేకనే వెళ్లానని రవితేజ తెలిపారు. షూటింగ్ లొకేషన్లో కాస్త నవ్వుతూ కనిపించినా, ఫొటోలకు ఫోజులు ఇచ్చినా అది కేవలం పైకి కనిపించేది మాత్రమే..... తమ్ముడు మరణించిన బాధ లోన ఉంటుందని రవితేజ తెలిపారు. అయితే రవితేజ మీడియా తీరును తప్పుబట్టడంతో కొందరు విలేకరులు తమ ప్రశ్నలదాడితో రవితేజను బెదరగొట్టారు. మా వద్ద ప్రూఫ్స్ ఉన్నాయి, మీరు చేసిన పనిని కప్పిపుచ్చుకోవాలని చూడొద్దు అని గట్టిగా మాట్లాడటంతో.... రాంగ్ న్యూసులు రాసే ముందు ఒక్కసారి ఆలోచించుకోండి అంటూ రవితేజ అక్కడి నుండి వెళ్లిపోయారు.

### 100 కోట్లతో
## పవన్ కల్యాణ్ సినిమా..



పవర్‌స్టార్ పవన్ కల్యాణ్, సెన్సేషనల్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్నది. పవన్ కెరీర్‌లో గతంలో మునుపెన్నడూ లేని విధంగా భారీ సెట్టింగులు, హంగులు, ఆరాటోలతో ఈ సినిమా రూపుదిద్దుకొంటున్నది. ఈ చిత్రం కోసం భారీగా ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే రామోజీ ఫిలిం సిటీలో భారీ సెట్‌ను వేశారు. ఈ సినిమా షూటింగ్ కోసం పవన్, చిత్ర యూనిట్ విదేశాలకు వెళ్తున్నట్టు సమాచారం.

ఇప్పటివరకు పవన్, త్రివిక్రమ్ సినిమా దాదాపు 60 శాతం పూర్తయింది. ఈ చిత్రం షూటింగ్ అంతా హైదరాబాద్‌లోనే చేశారు. కానీ మిగితా కొంత మొత్తాన్ని తెరకెక్కించేందుకు చిత్ర యూనిట్ బల్గేరియాకు వెళ్తున్నట్టు సమాచారం. ఇప్పటికే బల్గేరియాలో కొన్ని ప్రాంతాలను త్రివిక్రమ్ ఎంపిక చేసినట్టు తెలుస్తున్నది. జల్సా, అత్తారింటికి దారేది చిత్రాల విజయం తర్వాత పవన్, త్రివిక్రమ్ కాంబినేషన్ హ్యాట్రిక్ కోసం సిద్ధమవుతున్నది. కథాకు తగినట్టుగా సినిమాను చాలా రిచ్‌గా తెరకెక్కిస్తున్నారు. సినిమాపై భారీ అంచనాలు నెలకొనడంతో నిర్మాత కూడా వెనుకాడకుండా డబ్బును నీళ్లలా ఖర్చు పెడుతున్నట్టు తెలుస్తున్నది. పవన్, త్రివిక్రమ్ సినిమా కోసం రూ.100 కోట్లు కేటాయించినట్టు సమాచారం. అదే నిజమైతే పవన్ కెరీర్ అత్యంత భారీ బడ్జెట్ చిత్రంగా త్రివిక్రమ్ సినిమా కానున్నది. ఈ చిత్రం కోసం రామోజీ ఫిలిం సిటీలో వేసిన సెట్ టాక్ ఆఫ్ ధి ఇండస్ట్రీగా మారింది.

కథ కోసం దుబాయ్‌లో ఉండే భారీ భవనం సెట్‌ను వేయడం విశేషం. దుబాయ్‌లో అత్యంత సంపన్నులు ఉండే ప్రాంతానికి సంబంధించిన సెట్ కోసం రూ.1.5 కోట్లు ఖర్చు చేసినట్టు తెలుస్తున్నది. నిర్మాత రాధాక ృష? ఏమాత్రం రాజీ పడటం లేదనేది ప్రస్తుతం టాక్.

## మంచి లక్షణాలున్న అబ్బాయ్!



నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి ఎంఎల్‌ఏ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమా ద్వారా ఉపేంద్ర మాధవ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మంచి లక్షణాలున్న అబ్బాయ్ అని ఉపశీర్షిక. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ కథానాయిక. లక్ష్మీకల్యాణం తరువాత కల్యాణ్‌రామ్‌తో కాజల్ కలిసి నటిస్తున్న చిత్రమిది. బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై కిరణ్‌రెడ్డి, భరత్ చౌదరి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బుధవారం హీరో కల్యాణ్‌రామ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఫస్ట్‌లుక్‌లో జెంటిల్‌మన్ లుక్‌తో కనిపిస్తున్నాడు కల్యాణ్‌రామ్. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ దశలో వుంది.

## అందుకే దేశం విడిచి పారిపోయాను: ఇలియానా

ఒకప్పుడు సౌతలో టాప్ హీరోయిన్‌గా తన హవా కొనసాగించిన ఇలియానా... తర్వాత బాలీవుడ్ వైపు అడుగులు వేసి అక్కడ కూడా అవకాశాలతో దూసుకెలుతోంది. బాలీవుడ్లో సీనియర్ హీరోలైన అక్షయ్ కుమార్, అజయ్ దేవగన్ తదితరులతో పాటు.... నెక్స్ జనరేషన్ హీరోలు వరుణ్ ధావన్, అర్జున్ కపూర్, మిడిల్ జనరేషన్ హీరోలు రణబీర్ కపూర్, షాహిద్ కపూర్ లాంటి వారితో నటించిన ఏకైక నటి ఇలియానా. అంతే కాకుండా సౌత్ లో దాదాపు అందరు టాప్ హీరోలతో ఆమె నటించింది. ప్రస్తుతం బాలీవుడ్లో సంత ృప్తికరంగా కెరీర్ కొనసాగిస్తున్న ఇలియానా.... ఇటీవల ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడించింది. 15 ఏళ్ల వయసులోనే తాను హీరోయిన్‌గా అవకాశం వచ్చిందని తెలిపారు. 15 ఏళ్ల వయసులోనే మోడల్ గా కెరీర్ ప్రారంభించాను. ఆ సమయంలో కొన్ని చెత్త యాడ్స్ కూడా చేశాను. సినిమా అవకాశాలు రావడంతో మోడలింగ్ మానేశాను. 15 సంవత్సరాల వయసున్నపుడే తెలుగులో తొలి ఆఫర్(దేవదాసు) వచ్చింది అని ఇలియానా తెలిపారు. తొలి అవకాశం వచ్చినపుడు తనకు తెలుగు బాష రాదని, యాక్టింగ్ సరిగా రాదని చెప్పానని.... అయితే వారే మ్యానేజ్ చేసుకుంటామని చెప్పారని. తొలి సినిమా షూటింగ్ అమెరికాలో అని చెప్పడంతో అమెరికా వెళ్లొచ్చనే కారణంతోనే ఒప్పుకున్నట్లు ఇలియానా తెలిపారు. ఆ తర్వాత తనకు ఇంత ఆదరణ లభిస్తుందని ఊహించలేదన్నారు.



# 12 వరకు ఆస్తిపన్ను చెల్లించొద్దు

## జీహెచ్‌ఎంసీ

హైదరాబాద్: సర్కిళ్ల విస్తరణ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ పన్నుల విభాగాన్ని పునర్ వ్యవస్థీకరించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఆన్‌లైన్ డేటాబేస్‌ను 30 సర్కిళ్ల వారీగా విభజించి పన్ను వసూళ్లు చేపట్టేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ నెల 12వ తేదీ వరకు పౌరులు ఆస్తిపన్ను చెల్లించవద్దని జీహెచ్‌ఎంసీ ప్రకటించింది. ప్రస్తుతం ఇంటి నంబర్లు, ఇతర వివరాలను కొత్త సర్కిళ్ల పరిధిలో చేర్చి, ఆ సమాచారాన్ని అన్నిరకాల మాధ్యమాల్లో చేర్చే పనులు జరుగుతున్నాయని ఆర్థిక విభాగం అదనపు కమిషనర్ జయరాజ్‌కెనడి తెలిపారు. మారిన వివరాలను బిల్‌కలెక్టర్లు ఇళ్ల వద్దకు తీసుకొచ్చే చేతి యంత్రాల్లో, జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్‌లో, ఇతర మొబైల్ అప్లికేషన్లలో నిక్షిప్తం చేయాల్సి ఉందన్నారు. అప్పుడే కొత్త సర్కిళ్ల పరిధిలో ఆయా యజమానులు పన్ను చెల్లించాలని కోరారు.

# ప్రధానోపాధ్యాయుల శిక్షణ తరగతులు ప్రారంభం



కరీంనగర్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు, గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆర్ఎంఎస్ఏ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కరీంనగర్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. సెయింట్ అల్ఫోన్స్ ఉన్నత పాఠశాలలో వీటిని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 178 మంది పాల్గొన్నారు. వీరికి పలు అంశాలపై అవగాహన కల్పించేలా శిక్షణ అందిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు పాఠశాలల్లోని విద్యార్థులు ఆరోగ్యంగా నిలుస్తూ వారు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకునే ముందస్తు జాగ్రత్తలను డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశం, డీఐఏ జువేరియాలు వివరించారు. అలాగే ప్రధానోపాధ్యాయులకు హరితహారంతో పాటు బాలలకు గణితం, చదవడం, రాయడంలో నైపుణ్యాలు, పాఠశాలల బలోపేతం వంటి అంశాలపై శిక్షణను అందించారు. కార్య క్రమంలో డీఈవో రాజీవ్, నోడల్ అధికారి కోట లక్ష్మారెడ్డి, రిసోర్సు పర్సన్‌లు, ప్రధానో పాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇజ్రాయెల్ పువ్వుకి మోదీ పేరు



ఇజ్రాయెల్: ఇజ్రాయెల్ దేశానికి చెందిన ఓ పువ్వుకి భారత ప్రధాని నరేంద్ర మోదీ పేరు పెట్టారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం ఆయన ఇజ్రాయెల్ చేరుకున్న సంగతి తెలిసిందే. ఆ దేశాన్ని సందర్శించిన తొలి ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించారు.

ఈ సందర్భంగా ఇజ్రాయెల్‌లో ప్రసిద్ధిచెందిన క్రైసాంతిమమ్ పువ్వుకి మోదీ పేరు పెట్టారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రభుత్వం అధికారిక ట్విటర్ ద్వారా వెల్లడించింది. మోదీ ఇజ్రాయెల్ చేరుకున్న అనంతరం ఆ దేశ ప్రధాని బెంజమిన్ నేతన్యాహుతో కలిసి డాంజిగర్ పూలతోటను సందర్శించారు.

డాంజిగర్ దేశంలోనే అతిపెద్ద ఫ్లోరికల్చర్ కంపెనీ. దాదాపు 80,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ పూలతోట ఉంది. దీనిని 1963లో జెరూసలెంకి 56 కిమీల దూరంలో ఉన్న మోషావ్ మిష్మర్ హషివ ప్రాంతంలో కట్టించారు.

# కోహ్లీసేనతో పోరుకు గేల్ సిద్ధం



కింగ్‌స్టన్: భారత్-వెస్టిండీస్ మధ్య ఏకైక టీ20 జులై 9న జమైకాలో జరగనుంది. ఏకైక టీ20లో భారత్‌తో తలపడే విండీస్ జట్టును బోర్డు తాజాగా ప్రకటించింది. ఈ జట్టులో విధ్వంసకర బ్యాట్స్‌మెన్ క్రిస్ గేల్‌కు చోటు దక్కింది. అఫ్గానిస్థాన్‌తో ఈ మధ్య విండీస్ మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ఆడింది. ఆ సిరీస్‌లో గేల్‌కి స్థానం దక్కలేదు. ప్రస్తుతం లెండిల్ సిమన్స్ స్థానంలో క్రిస్ గేల్‌ను ఎంపిక చేసినట్లు వెస్టిండీస్ క్రికెట్‌బోర్డు చీఫ్ సెలక్టర్ బ్రోనే తెలిపారు.

అఫ్గానిస్థాన్‌తో జరిగిన సిరీస్‌లో సిమన్స్ 6, 17, 16 పరుగులు సాధించాడు. దీంతో అతని ప్రదర్శన పట్ల అసంతృప్తిగా ఉన్న విండీస్ బోర్డు భారత్‌తో జరిగే ఏకైక టీ20 కోసం ఎంపిక చేసిన జట్టులో సిమన్స్‌ను తప్పించి గేల్‌కు చోటు కల్పించింది. టీ20 విభాగంలో గేల్‌కి ఎంతో అనుభవం ఉందని, గేల్‌ని జట్టులోకి తీసుకోవడంతో జట్టు పటిష్ఠంగా ఉందని బ్రోనె చెప్పారు. ఏకైక టీ20 జరిగేది గేల్ స్వస్థలం జమైకాలోనే. గేల్ విండీస్ తరపున ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లాండ్‌పై ఆడాడు. ఆ తర్వాత టీ20 ఆడటం ఇదే.

విండీస్ జట్టు: కార్లస్ బ్రాత్‌వైట్(కెప్టెన్), శామ్యూల్ బద్రీ, రాన్స్‌ఫోర్డ్ బీటన్, క్రిస్ గేల్, ఎవిన్ లూయిస్, జాసన్ మహ్మద్, సునీల్ నరైన్, కీరన్ పొలార్డ్, రోమన్ పావెల్, మార్లన్ శామ్యూల్, జీరోమ్ వైలర్, చాడ్విక్ వాల్టన్ (వికెట్‌కీపర్), కిస్రిక్ విలియమ్స్.

# రవిశాస్త్రికి ప్రధాన పోటీ వీరే..



దిల్లీ: భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ పదవికి టీమిండియా మాజీ డైరెక్టర్ రవిశాస్త్రి దరఖాస్తు పంపిన విషయం తెలిసిందే. వీరేంద్ర సెహ్వాగ్, టామ్ మూడీ, ఫిల్ సిమన్స్, రిచర్డ్ పైబస్, దొడ్డా గణేశ్, లాల్‌చంద్ రాజ్‌పుత్ కూడా కోచ్ పదవికి రేసులో నిలిచారు. తాజాగా భారత జట్టు మాజీ సారథి సునీల్ గావస్కర్... కోచ్ పదవి రవిశాస్త్రికే దక్కే అవకాశాలున్నాయని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. అయితే రవిశాస్త్రి-విదేశీ కోచ్‌ల మధ్య తీవ్ర పోటీ నెలకొందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎందుకంటే.. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకి కోచ్‌గా బాధ్యతలు అందించాడు టామ్ మూడీ. అతను శ్రీలంక జట్టుకి కోచ్‌గా వ్యవహరించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో చాలా ఏళ్లు కొనసాగిన టామ్ మూడీకి అపారమైన అనుభవం ఉంది. ఐపీఎల్ ద్వారా భారత ఆటగాళ్లను అతను ప్రత్యక్షంగా గమనించిన అనుభవం కూడా ఉంది. అతను ఈ పదవికి పూర్తి అర్హుడు అని వివిధ దేశాలకు చెందిన మాజీ క్రికెటర్లు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆ తర్వాత పోటీ విండీస్‌కి చెందిన ఫిల్ సిమన్స్ నుంచి. విండీస్ జట్టు టీ20 ప్రపంచ కప్ సాధించడంలో ఫిల్ కీలకపాత్ర పోషించాడు. జింబాబ్వే, ఐర్లాండ్ జట్లకు అతను కోచ్ బాధ్యతలు అందించిన అనుభవం ఉంది. సిమన్స్ ఆధ్వర్యంలో ఎందరో యువ ఆటగాళ్లు వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే.

ఆ తర్వాత పోటీదారుడు దక్షిణాఫ్రికాకు చెందిన రిచర్డ్ పైబస్. పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లకు పైబస్ కోచ్‌గా వ్యవహరించాడు. అంతేకాకుండా పలు డొమెస్టిక్ సర్క్యూట్‌లోని జట్లకు పైబస్ పని చేశాడు. అతని హయాంలో జట్లు కీలక విజయాలు సాధించాయి. ఆటగాళ్లలో స్ఫూర్తి నింపడంలో పైబస్‌కు తనదైన ప్రత్యేకత ఉంది. దీంతో రవిశాస్త్రికి విదేశీ కోచ్‌ల నుంచి పోటీ తీవ్రంగానే ఉండవచ్చని అంటున్నారు. భారత జట్టు సారథి కోహ్లీ.. రవిశాస్త్రికి తన మద్దతిచ్చినట్లు గతంలో వార్తలు వచ్చాయి. దరఖాస్తుల స్వీకరణకు బీసీసీఐ జులై 9 వరకు గడువు ఇచ్చింది. గంగూలీ, సచిన్, లక్ష్మణ్‌తో కూడిన క్రికెట్ సలహా మండలి జులై 10న దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించి కోచ్ ఎవరో తేల్చనుంది.

# 'ఓటుకు నోటు' పరిశీలనకు సుప్రీం గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: తమిళనాడు అసెంబ్లీలో బలపరీక్షలో గెలిచేందుకు ఎమ్మెల్యేలను డబ్బు, బంగారం ఎర చూశారంటూ వెలుగుచూపిన స్టింగ్ ఆపరేషన్ వ్యవహారం మరో మలుపు తిరిగింది. ఈ వ్యవహారాన్ని పరిశీలించేందుకు సుప్రీం కోర్టు బుధవారం నాడు అంగీకరించింది. అయితే ఏ తేదీన దీనిపై విచారణ జరపనుందనేది కోర్టు ఇంకా నిర్ధారించలేదు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి గత ఫిబ్రవరిలో విశ్వాసపరీక్ష ఎదుర్కోవలసి వచ్చింది. ఆయనకు మద్దతివ్వాలంటూ శశికళ వర్గం ఎఐఏడీఎంకే ఎమ్మెలకు నగదు, బంగారం ఆశ చూపినట్టు ఓ ఆంగ్ల ఛానెల్ నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్‌లో వెలుగుచూసింది. నాటి విశ్వాసపరీక్షలో 122 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు మద్దతు ఇవ్వడంతో పళనిస్వామి గెలిచారు. శశికళ వర్గం తనకు రూ.2 కోట్ల నుంచి 6 కోట్లు ఇవ్వ జూపిందంటూ ఓపీఎస్ వర్గానికి చెందిన సౌత్ మదురై ఎమ్మెల్యే శరవణన్ స్టింగ్ ఆపరేషన్‌లో వెల్లడించడం తమిళ రాజకీయాలను కుదిపేసింది.

# భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కరీంనగర్ : పండుగల ఆరంభానికి సూచికగా భావించే తొలి ఏకాదశి పండుగ ఉత్సవాలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. శ్రీ మహా విష్ణువును ఆరాధిస్తూ ఆలయాల్లో భక్తులు పూజలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం ఇళ్లల్లో, పూజా మందిరాల్లో పూజలు నిర్వహించుకొని పిండి వంటలు చేసుకున్నారు. ముఖ్యంగా కూడిన తొలి ఏకాదశి రావడంతో భక్తాంజనేయ స్వామి ఆలయాలు, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాలతో విష్ణుమూర్తి సంబంధ ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. భగత్‌నగర్ అయ్యప్ప ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతినగర్, ప్రశాంత్‌నగర్, అంజనాద్రి గుట్టపై, మంకమ్మతోట భక్తాంజనేయ స్వామి ఆలయంలో, మంకమ్మతోట, మార్కెట్ రోడ్డు, విద్యానగర్ వేంకటేశ్వర స్వామి ఆలయం కమాన్‌రోడ్డులోని శ్రీ రామేశ్వరాలయంలో పంచసూక్త ఏకరుద్ర రుద్రాభిషేకాలు నిర్వహించారు.

ఉర్మండ్ల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో గోపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అవధానుల వేంకటేశ్వరశర్మ, చల్లా మోహన్‌రెడ్డిలు ప్రత్యేకంగా రుద్రాభిషేకాలు, గోపూజలు ఏర్పాటు చేశారు.



# ప్రముఖ పండితుడు ఉమాపతి కాలధర్మం



హైదరాబాద్ : ప్రముఖ పండితుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి ఉమాపతి పద్మనాభశర్మ (90) హైదరాబాద్‌లో కన్నుమూశారు. తొలితరం కథారచయితగా, కవిగా, వేణుగాన విద్వాంసులుగా, ఆధ్యాత్మికవేత్తగా ఆయన ప్రజలకు సుపరిచితులు. హైదరాబాద్ అల్వాల్‌లోని కుమారుని నివాసంలో ఉంటున్న శర్మకు ఇటీవల తుంటి ఎముక విరిగింది. కుటుంబసభ్యులు దవాఖానలో చేర్చగా, ఆయన చికిత్స పొందుతూ గుండెపోటుతో మరణించారు. అల్వాల్ హిందూ శ్మశానవాటికలో శర్మ భౌతిక కాయానికి అంత్యక్రియలు చేశారు. శర్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండేండ్ల క్రితమే భార్య చనిపోయారు.

ఉమాపతి పద్మనాభశర్మ స్వస్థలం సిద్దిపేట. అక్కడి పారుపల్లివీధిలో నివాసం. సాహితీ వికాసమండలికి చాలాకాలం అధ్యక్షుడుగా వ్యవహరించి అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, లెక్చరర్‌గా పనిచేశారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పుల్లూరు హైస్కూల్‌లో చదివే రోజుల్లో శర్మ ఆయనకు గురువు. సాహిత్యానికి ఆయన చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం గత జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావదినోత్సవాల సందర్భంగా తెలంగాణ విశిష్ట పురస్కారం ఇచ్చి సత్కరించింది.

***సీఎం కేసీఆర్ సంతాపం..***

గురువు పద్మనాభశర్మ మరణం పట్ల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. సాహితీరంగంలో శర్మ సేవలను కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. శర్మ మృతికి భారీ నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు.

ఆయన మరణం తెలంగాణ ప్రాంతానికి తీరనిలోటని తెలిపారు. సిద్దిపేట బ్రాహ్మణ పరిషత్ శర్మ మృతికి సంతాపం ప్రకటించింది. అధ్యక్షుడు లోకరవిచంద్ర, ప్రధాన కార్యదర్శి నాగరాజు ప్రగాఢ సానుభూతిప్రకటించారు.

# డ్రగ్స్ మాఫియాపై నెల రోజులుగా దర్యాప్తు

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో సాగుతున్న డ్రగ్స్ మాఫియా కార్యకలాపాలపై నెల రోజులుగా లోతుగా దర్యాప్తు చేస్తున్నామని.. పది రోజులు నుంచి చర్యలు చేపట్టామని అబ్కారీ శాఖ డైరెక్టర్ అకున్ సబర్వాల్ తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగరంలో సుమారు వెయ్యి మందికి పైగా ఈ కేసుతో సంబంధం కలిగి ఉన్నారని తెలిపారు. డ్రగ్స్ వినియోగిస్తున్న విద్యార్థుల పేర్లు గానీ... వారు చదువుతున్న పాఠశాలల పేర్లు గానీ తాము వెల్లడించలేదని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ కేసును సునిశితంగా దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. చాలా పాఠశాలల్లో విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలైనట్లు ఉపాధ్యాయులకు తెలియదన్నారు.

పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని.. విద్యార్థుల్లో వచ్చే మార్పులను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. తోటి స్నేహితుల ఒత్తిడి, ఇంట్లో ఒంటరితనం వల్ల కొందరు పక్కదారి పట్టే అవకాశం ఉందన్నారు.

***డ్రగ్స్ కేసులో మరొకరు అరెస్ట్***

డ్రగ్స్ కేసులో ఎక్సైజ్ అధికారులు బుధవారం మరొకరిని అరెస్ట్ చేశారు. హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థ నడుపుతున్న బెండెన్ బెన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిఖిల్ శెట్టి, కెల్విన్, బెండెన్‌లు కలిసి డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటివరకు 8 మందిని అరెస్ట్ చేశామని.. 27 కళాశాలలు, 26 పాఠశాలలు, సినీ, వ్యాపార రంగాల ప్రముఖులకు నోటీసులు జారీ చేసినట్లు అకున్ సబర్వాల్ తెలిపారు.




VIJAYABHANU - Hyderabad
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS**, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com